SCERT TELANGANA

పాఠశాల విద్యాశాఖ
తెలంగాణ, హైదరాబాద్

## రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్రం - 2011

# భాష మరియు భాషా బోధన ఆధారపత్రం

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ
తెలంగాణ, హైదరాబాద్

# రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం - 2011

# భాష మరియు భాషా బోధన ఆధార పత్రం

SCERT TELANGANA

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ

తెలంగాణ, హైదరాబాద్

First Print 2011

Reprint 2019

SCERT TELANGANA

State Council of Educational Research & Training,
Telangana, Hyderabad.

# విషయసూచిక


* సంక్షిప్త సారాంశం:

1. భాష స్వభావం - నూతన దృక్పథం 05
   - పరిచయం
   - భాష అంటే ఏమిటి?
   - భాషావిభాగం
   - పిల్లలు భాషను ఎలా పొందుతారు?
   - భాషలో అందించే వనరులు (In puts) ఫలితాలు (Out puts)

2. భాష - సమాజం - ఇతర అంశాలు 09
   - భాష - సమాజం
   - బహుభాషత్వం
   - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బహుబాషత్వం
   - భాష మరియు ఆలోచన
   - భాష మరియు మాండలికం
   - భాష మరియు లిపి
   - రెండవ భాషను నేర్చుకోవడం
   - భాష - సమిత్మళిత విద్య
   - RTE - 2009 మరియు భాషాంశాలు
   - నూతన దృక్పథం - తరగతిగది అన్వయం

3. భాషాభ్యసనం - ఫలితాలు 17
   - పరిచయం
   - ఆశించే ఫలితాలు
   - సౌందర్యాత్మక స్పృహ మరియు సామాజిక బాధ్యత
   - అధిభాషాస్పృహ (Metalingustic Awareness)




SCERT TELANGANA

| | | |
|---|---|---|
| 4. | **బోధనా పద్ధతులు, పాఠ్యపుస్తకాలు, సామగ్రి** | **20** |
| | • పరిచయం | |
| | • బోధనాభ్యసన కృత్యాలు, వ్యూహాలు | |
| | • పాఠ్యపుస్తకాలు మరియు భాషా వనరులు | |
| | • భాషాభ్యసనం - అదనపు సామాగ్రి | |
| 5. | **మూల్యాంకన పద్ధతులు** | **28** |
| | • పరిచయం | |
| | • అర్థవంతమైన మూల్యాంకనం | |
| | • మనం ఏమి చేయాలి? | |
| 6. | **ఉపాధ్యాయ శిక్షణ** | **31** |
| | • పరిచయం | |
| | • NCF - 2005 మరియు RTE - 2009 | |
| | • ముగింపు | |
| 7. | **సిఫారసులు** | **36** |
| **అనుబంధం:** | (I) భాషా విషయనిపుణులు మరియు సభ్యుల పేర్లు | 40 |
| | (II) రిఫరెన్సులు | 42 |

SCERT TELANGANA

# భాష - భాషాబోధన - ఆధారపత్రం

# సంక్షిప్తసారాంశం

భాష మరియు భాషా బోధన ఆధారపత్రం పాఠశాల్లో భాషను బోధించాల్సిన తీరుకు చెందిన బోధనాశాస్త్ర చట్రాన్ని (Pedagogical Framework) వివరిస్తుంది. ఈ ఆధారపత్రాన్ని సహజ పరిసరాలలో చిన్నతనంలో పిల్లల భాషాసంపాదనకు చెందిన పలు సైద్ధాంతిక సూచనల ఆధారంగా రూపొందించారు. ఒకవేళ పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తే, మానసిక వైకల్యం లేని పిల్లలు తప్ప మిగతా పిల్లలందరు నాలుగేండ్ల ప్రాయానికే ఒకటికంటే ఎక్కువ భాషలను సునాయాసంగా పొందుతారు. మానవ భాషలన్నీ అత్యంత సంక్లిష్టమైనవే! మానవ భాషలకు చెందిన ధ్వనులు, పదాలు, వాక్యాలు వ్యవస్థల వాటి అర్థాలు ఎంత సంక్లిష్టమైనా పిల్లలు వాటిని చిన్నతనంలోనే సులభంగా సొంతం చేసుకోవడాన్ని గమనించవచ్చు. దీన్ని బట్టి పిల్లలందరు భాషను నేర్చుకోడానికి దోహదపడే అంతర్గత భాషా విభాగాన్ని (Innate Language Faculty) పుట్టుకతోనే కల్గిఉన్నారని చెప్పవచ్చు. ఈ భాషా ఆధారపత్రం మరో రెండు సూత్రాలను తెలియజేస్తున్నది.

వాటిలో మొదటి సూత్రం సుసంపన్నమైన భాషా పరిచయ వాతావరణం మరియు బహుభాషత్వం, అంతర్గత సామర్థ్యం కలిగిన పిల్లలకోసం నియత పాఠశాలల్లో సుసంపన్నమైన, అర్థవంతమైన, ఆసక్తికరమైన, సవాళ్ళను విసరగలిగే సురక్షిత, సానుభూతితో అర్థంచేసుకొనే వాతావరణాన్ని సహజసిద్ధంగా కల్పించడం తప్పనిసరి అవసరాలని చెప్పవచ్చు.

అట్లే రెండవ సూత్రం ఏమంటే చాలా తరగతులలో విస్తృత పరిధిలో ఉన్న బహుభాషత్వం / భాషారూపాలంటే ఎన్నో భాషలు లేదా ఒకే భాషకు చెందిన వివిధ రూపాలు చోటుచేసుకోవడాన్ని తప్పకుండా గుర్తించాల్సి ఉంది. పిల్లలకు చెందిన భాషలను గుర్తించడం, వాటిని గౌరవించడం, వాటిని తరగతిగదుల్లో బోధనాభ్యసన ప్రక్రియల్లో ఉపయోగించకుంటే పిల్లలు క్రమంగా దూరమై పాఠశాలను వదిలి బడి బయటి పిల్లలుగా మారుతారు. కాబట్టి బహుబాషత్వం మూలాలతో రూపొందించిన ఈ ఆధారపత్రం భాషాబోధనా శాస్త్రానికి ఒక విన్నపాన్ని చేస్తున్నది. ఈ మధ్యకాలంలోని పరిశోధనలు బహుభాషత్వానికి పిల్లలయొక్క సాధనస్థాయికి, జ్ఞానాత్మకఅభ్యువృద్ధికి, సామాజిక సహనశీలతకు మధ్య ధనాత్మక సహహంబంధ కలిగిఉన్నదని తెలుపుతున్నాయి. కాబట్టి ఏ భాషాబోధన కార్యకమమైనా తప్పనిసరి బహుభాషత్వాన్ని ప్రోత్సహించాలి

ఈ ఆధారపత్రంలో ఏడు అధ్యాయాలు, రెండు రిఫరెన్సులు ఉన్నాయి. మొదటి రెండు అధ్యాయాలు భాషాస్వభావం, భాషావిభాగం, పిల్లలు భాషను పొందే విధానం, భాషలలో సమాజానికి, ఆలోచనకు, మాండలికానికి, మాట్లాడటం, లిపి వాటితోగల సంబంధాలను గురించి చర్చించింది. బహుభాషత్వం కేంద్రంగా ఉన్న అంశాలగురించి దాని తరగతిగది అన్వయం గురించి ఈ దృక్పథంలో చోటుచేసుకోవాల్సిన భాషాబోధన గురించి కూడా చర్చించింది. అట్లే ఆర్.టి.ఇ. - 2009 గురించి మరియు



SCERT TELANGANA

ప్రత్యేక అవసరాల పిల్లలగురించి పాఠశాలల్లో ఆ దిశగా చేపట్టవలసిన చర్యలగురించి కూడా ప్రస్తావించింది. అన్ని వైకల్యాలు కలిగిన పిల్లలకోసం పాఠశాలలను భౌతికంగా, సాంస్కృతికంగా, ప్రజ్ఞావంతంగా అందుబాటులోకి వచ్చేలా చేయాలని బలమైన వాదాన్ని వినిపించింది.

మూడవ అధ్యాయం భాషాభ్యసనం - ఫలితాలుకు చెందినది. పాఠశాలలోని భాషాబోధనా కార్యక్రమాలన్నీ, పిల్లలు బడికి వచ్చేనాటికి కలిగిఉండే భాషాసామర్థ్యాన్ని, భాషా స్థాయిలను వృద్ధిపరచడానికి దోహదపడేలా చర్యలను చేపట్టేలా ప్రాథమికంగా దృష్టిపెట్టాలని సూచించింది. ఒకవేళ పిల్లలందరు తమ మాతృభాష లేదా ప్రథమ భాషలో సమర్థతను కలిగిఉంటే, ఇది ఇతర భాషల్లోకూడా సమర్థతను పొందడానికి దోహదపడుతుంది. అట్లే గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం వంటి ఇతర సబ్జక్టులకు చెందిన మౌళిక/ప్రాథమిక భావనలను అర్థంచేసుకోవడానికికూడా దోహదపడుతుందని వాదించింది. అట్లే భాషాబోధన అనేది వినడం, మాట్లాడం, చదవడం, రాయడం అనే నైపుణ్యాలను వేటికవే పొందడంకన్నా సమగ్రంగా సమర్థతను సాధించడానికి దోహదపడాలని చెప్పింది. అంటే వింటూ అర్థంచేసుకోవడం, మాట్లాడం, చదివిన దానిని అర్థంచేసుకోవడం దానికి తన అభిప్రాయాలను జోడించి మాట్లాడడం, రాయడం, చర్చించడం వంటి ఒకదానితో ఒకటి సంబంధం కలిగిన అంశాలుగా ఉంటాయని తెలిపింది.

నాల్గవ అధ్యాయం భాషాబోధనా పద్ధతులు, పాఠ్యపుస్తకాలు, సామగ్రి గురించి వివరించింది. పిల్లలను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా వివిధ రకాలైన వ్యవహార రూపాలతో పరిచయం కలిగించాలని వాటిలో పూర్తిగా నిమగ్నమయ్యేలా చేయడాన్ని ప్రోత్సహించాలని సూచించింది. జట్లలో కూర్చుని చదవడం, చర్చించి అభిప్రాయాలను చెప్పడం, చర్చలలో పాల్గొనడం, నివేదికలు తయారుచేయడం, గోడపత్రికలు నిర్వహించడం, నృత్యాభినయం, నాటకీకరణ, తోలుబొమ్మలాట, ప్రాజెక్టుపనులు మొదలగునవి భాషాభ్యసనంలో ఉపయోగపడే ముఖ్యమైన వ్యూహాలని తెలిపింది.

ఐదవ అధ్యాయం మూల్యాంకనా విధానాలకు సంబంధించినది. ఇది సమగ్రంగా, నిరంతరంగా సమీకృతంగా ఉంటూ బోధనాభ్యసనప్రక్రియలలో భాగం కావాలని వాదించింది. బోధన మరియు మూల్యాంకనా విధానాలు పిల్లల వ్యక్తిత్వానికి, జ్ఞానాత్మక, సామాజిక, సాంస్కృతిక మరియు నైతిక అంశాలతో కూడి ఉండాలని తెలిపింది.

ఆరవ అధ్యాయం ఉపాధ్యాయ శిక్షణలకు సంబంధించినది. ఇది వృత్తిపూర్వతక వృత్యంతర శిక్షణలు పరస్పరం ఆధారపడి వుంటాయని, నిరంతరం కొనసాగే ప్రక్రియగా ఉండాలని తెలిపింది.

ఆఖరి ఏడవ అధ్యాయం మన రాష్ట్రంలోని పాఠశాల విద్యలో భాష గురించి చేపట్టవలసిన చర్యలను, ప్రతిపాదనలను సిఫారసుచేసింది. దీని చివర రెండు అనుబంధాలు ఉన్నాయి. మొదటి అనుబంధంలో ఈ ఆధారపత్రం తయారీకి సహకరించి మార్గదర్శనం చేసిన విషయ నిపుణుల పేర్లు, భాషా కమిటీ సభ్యుల పేర్లు ఉన్నాయి. రెండవ అనుబంధంలో ఈ ఆధారపత్రం తయారీకి దోహదపడిన రిఫరెన్స్ పుస్తకాలు, గ్రంథాలు, వ్యాసాల వివరాలున్నాయి. ఈ ఆధారపత్రాన్ని రూపొందించిన కమిటీ సభ్యులు, విషయనిపుణులు అనుబంధంలో పేర్కొన్న రిఫరెన్సులు రాష్ట్రంలోని జిల్లా విద్యా శిక్షణాసంస్థలకు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థలకు అందించాలని సూచించింది.



SCERT TELANGANA

# 1. భాషా స్వభావం - నూతన దృక్పథం

**పరిచయం**

ఈ పత్రంలోని పరిచయ వాక్యాలు, ఆ తర్వాత పుటల్లోని అంశాలు NCERT 2005 మరియు NCERT వారు సిద్ధం చేసిన 'భారతీయ భాషల బోధన' మరియు 'ఆంగ్లభాషా బోధన' అనే రెండు ఆధార పత్రాలపై ఆధారపడ్డాయి. ఈ పత్రంలో పొందుపరిచిన భాషా విషయక కొత్త దృక్పథం సంప్రదాయంగా విశ్వసిస్తున్న ప్రేరణ, స్పందన మరియు అనుకరణాల ద్వారా భాషాభ్యసనం జరుగుతుందన్న అంశాలు నుండి స్పష్టంగా భిన్నమైనది.

సామాన్య ప్రజలందరూ భాషను ఒక భావ వ్యక్తీకరణ సాధనంగా మాత్రమే గుర్తిస్తారు లేదా భావిస్తారు. ఇక వృత్తినిపుణులైన భాషా శాస్త్రవేత్తలు పదబంధాలను అనుసంధానం చేయడమని, వాక్య నిర్మాణ నియమాల సమాహారమని భావిస్తారు. భాష వివిధ స్థాయిలల్లోని ధ్వనులు, వర్ణాలు, పదాలు, వాక్యాలు, వ్యవస్థీకృతమైన పలు నియమాలకు లోబడి భాషలు పనిచేస్తాయని ఈ దృక్పథం వెల్లడిస్తుంది. ఐనప్పటికీ ఈ దృక్పథం మనకు భాషయొక్క పూర్తి స్వరూపాన్ని ఆవిష్కరించదు. అందువల్ల భాషను విస్తృతమైన చట్రంలోనే దర్శించాలి. తద్వారా దీనిని ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే అధ్యాపకులకు, పాఠ్యపుస్తక రచయితలకు, విద్యా ప్రణాళికా రూపకర్తలకు, విద్యాక్షేత్ర ప్రణాళికా రచయితలకు ఉపయుక్తం చేయాలి. దీనిని బహుముఖంగా పరిశీలించాలి. అంటే నిర్మాణపరంగా, సామాజిక దృష్టితో సాంస్కృతిక దృష్టిలో, మనోవైజ్ఞానిక దృష్టితో, సాధారణాత్మక దృష్టితో భాషను పరిశీలించాల్సి ఉంటుంది.

**భాష అంటే?**

భాషలు లేని వ్యక్తులు లేదా సమాజాలను ఊహించలేం. వ్యక్తుల గుర్తింపుకు భాష తప్పనిసరి. ఇది సమాజంలోని పరిసరాల్లోని ఇతర వ్యక్తులతో వీరిని అనుసంధానం చేస్తుంది. మన మనస్సుల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న సమాజం మరియు పరిసరాలు భాష ద్వారానే వ్యక్తమవుతాయి.

భాష మానవులకు గల ప్రత్యేక లక్షణం. ఇది భావవాహిక దీనిని మనం ఆలోచించడానికి, సమస్యలను పరిష్కరించుకోవడానికి, ఆడుకోవడానికి, కలలు కనటానికి, వ్యాఖ్యానించడానికి, ఉద్వేగాల వ్యక్తీకరణకు, సమాచారాన్ని పంచుకోవడానికి ఉపయోగించుకుంటాం. ఇతరులతో మాట్లాడటానికే గాక మనలో మనమే మాట్లాడుకోవడానికి కూడ భాషను ఉపయోగిస్తాం. ఈ భాష మన సామాజిక వైఖరులకు, అధికార సంబంధాలకు దగ్గరి సంబంధం కల్గి ఉందన్న విషయాన్ని కూడా మన దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయశిక్షకులు, విద్యా ప్రణాళికా రచయితలు అందరూ పిల్లలు నాలుగేండ్ల వయస్సు నాటికే భాషా విషయక వృద్ధులౌతారని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిదండ్రులు కాని, బంధువులు కాని ఎవరు తమ పిల్లలకు ప్రత్యేకంగా భాషను బోధించరు.



SCERT TELANGANA

పిల్లలే స్వయంగా సుసంపన్నమైన భాషా నియమాల వ్యవస్థను, భాషాధ్వనులు, పదాలు, వాక్యాలు వాటి అర్థాలను అర్థం చేసుకుంటారు. సందర్భానికి తగిన భాషారూపాన్ని ఎంపిక చేసుకొని వ్యక్తీకరించడాన్ని పిల్లలు సొంతం చేసుకొంటారు. ఒక తెలుగు మాట్లాడే శిశువు ఎప్పుడు 'నీవు' అనాలో ఎప్పుడు 'మీరు' అనాలో తెలుసుకొని ఉంటుందన్నది వాస్తవాంశమే.

## భాషావిభాగం (Language Faculty)

పై అంశాలననుసరించి పిల్లలు పుట్టుకతోనే సహజమైన భాషా శక్తిని, భాషాభ్యసన కల్గియున్నారని స్పష్టమవుతోంది. పలువురు పిల్లలు ఒక భాషను మాత్రమే గాక తమ పరిసరాల్లోని పలు భాషలను మాట్లాడటాన్ని మనం గమనించవచ్చు. మనం ఒక వేళ పిల్లల్లో గల ఈ సహజ భాషాభ్యసన శక్తిని రక్షితమూ, సుసంపన్నమైన పరిసరాలలో పెంచిపోషించగల్గితే పిల్లలు తప్పనిసరిగా ఆ భాషలను అభ్యసించగల్గుతారు అని చెప్పవచ్చు.

పిల్లల్లో సహజంగా, అంతర్గత భాషాభ్యసన శక్తియుందన్న విషయ స్పృహకు బోధనశాస్త్రపరంగా అధిక ప్రాధాన్యత ఉంటుంది. తగినంత పరిచయం లభిస్తే కొత్త భాషనైనా సులభంగా పిల్లలు అభ్యసిస్తారని, ఆ అభ్యసన భాషలో వ్యక్తీకరణకు అవకాశాలు కల్పిస్తే వారు సమర్థంగా తమ భాషాపాటవాన్ని ప్రదర్శిస్తారని చెప్పవచ్చు. అందువల్ల మన బోధనలో వ్యాకరణానికి ప్రాధాన్యం ఇవ్వకుండా అర్థానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

## పిల్లలు భాషను ఎలా పొందుతారు? (How do children acquire language)

మాతృభాషా విషయంలో సామాన్య శిశువు కింది విధంగా వ్యక్తీకరిస్తాడు

ఉదా : అమ్మా! అన్నం పెట్టు. అన్నం తిని ఆడుకుంటా.

పై వాక్యాలలో శిశువు 'అన్నంపెట్టు' అని అన్నదేగాని పెడతాను, పెట్టుతాను, పెడతాడు, పెడుతుంది వంటి పదాలు వాడలేదు. ఇందుకు కారణం శిశువు అమ్మను (తల్లి) అడుగుతోంది. కాబట్టి శిశువు పెట్టు అనే పదాన్ని అందువల్లే వాడింది. అదే విధంగా శిశువు ఆడుకుంటా అంది. అంతేకాని ఆటాడు, ఆడతాడు అని అనలేదు. కారణం నేను అన్న ఉద్దేశ్యంతో శిశువు ఆ పదాన్ని వాడడమే.

ఈ ఉదాహరణ ఒక విషయం స్పష్టం చేస్తోంది. శిశువు తనదైన భాషా రూపాన్ని నిర్మించుకొంది. ఆ రూపానికి సంబంధించిన జ్ఞానం శిశువుకుంది. శిశువు తెలుగు భాషా వాక్య స్వరూపం గురించి సహజంగానే తెల్సుకొంది. ఈ రూపం ఇలా ఉంటుందని ఎవరూ చెప్పలేదు. అందువల్ల ప్రతి భాషోపాధ్యాయుడు ఈ అంశాలను దృష్టియందుంచుకోవాలి. పిల్లలందరూ ఈ సహజమైన శక్తియుక్తులు గల వారని వారు భాషా విషయక జ్ఞానాన్ని సృజించగల్గుతారని వారు భాషకు సంబంధించిన సమాచారంతో పరస్పర చర్య జరుపుతారని గ్రహించాలి.

ఒక వేళ మనం పై వాక్యాన్ని నిశితంగా పరిశీలిస్తే భాష ఎంత క్లిష్ట నిర్మాణం గలదో ఎవరైనా గ్రహించవచ్చు. ఇది సంక్లిష్టమైన నియమాలతో కూడిన వ్యవస్థ. పై వాక్యంలోని సంక్లిష్టమైన పదక్రమంలో ఉంది. కర్త, కర్మల మధ్య సంబంధముంది, కర్తరి, కర్మణి క్రియలను తెల్పుతుంది.

ఎవరూ భాషను పదం వెనుక పదం వాక్యం వెనుక వాక్యంగా బోధించరు. కాని పిల్లలు అనియతంగానే అర్థవంతమైన సందర్భాల్లో భాషకు సంబంధించిన జ్ఞానాన్ని సంపాదిస్తారు. భాషా సంపాదనలో తక్షణ ఫలితాలను అంతగా మన మెప్పుడూ ఆశించరాదు. పిల్లలు శారీరకంగా, జ్ఞానాత్మకంగా సమర్థులైనప్పుడే వారు మాట్లాడతారు. అట్లే సందర్భాన్ని బట్టి చెప్పాల్సి వచ్చినపుడు మాట్లాడతారు. మాట్లాడనంతమాత్రాన వారికి భాష అలవడలేదని భావించకూడదు. యాంత్రికమైన, అర్థరహితమైన పునశ్చరణ పిల్లలు కంఠతా పట్టి వృథాగా శ్రమపడటానికి మాత్రమే ఉపకరిస్తుంది. కాని నిజమైన భాష అలవడదు.

కాబట్టి మనం ఏమిచెప్పగలమంటే....

- జన్యుపరంగానే మానవ శిశువులకు ఒక భాషా వ్యవస్థ సంక్రమించింది. దానినే విశ్వవ్యాకరణం అంటారు. (ఛామ్స్కీ). మనం భాషా సంపాదన అనేది కేవలం శిశువులోని ఈ అంతర్గత శక్తిని ఆవిష్కరించటమే.
- భాషా సంపాదన చక్రీయ పద్ధతిలో ప్రగతి సాధిస్తుంది. రేఖీయ పద్ధతిలోగాని సమీకృత పద్ధతిలో గాని కాదు.
- భాషా సంపాదనలో అనుకరణకు ప్రాధాన్యత తక్కువ. మనం అనుకరణగా భావించే అంశాలు శిశువులకు జన్మత అలవడిన భాషా విషయక జ్ఞానం మాత్రమే.
- పదే పదే వల్లె వేయడం వల్ల భాష అలవడదు. అవసరానుగుణమైన, అర్థవంతమైన భాషా వినియోగ సందర్భాల్లో ఆవృత్తమయ్యే భాషా విషయక వాస్తవాల వల్ల భాష అలవడుతుంది.
- కేవలం పరస్పర సంబంధం లేని ఒంటరి (isolated) పదాలు, వాక్య నిర్మాణాల ద్వారా భాష అలవడదు. పలు సందర్భాల్లో జరిగే వ్యక్తీకరణల వల్ల జరుగుతుంది.
- భాష కేవలం శ్రవణ, భాషణ, పఠన, లేఖనాలనే నాల్గు నైపుణ్యాల సమాహారం కాదు. ఈ నైపుణ్యాలను ప్రదర్శించుటకు అవసరమైన అంతర్గత శక్తుల మొత్తం మాత్రమే.
- భాష పొందడమనేది మొత్తం నుండి భాగాల వైపు పయనిస్తుంది. కాని భాగాల నుండి మొత్తం వైపు కాదు. ఇది భాషకు (holistic treatment)కోరుతుంది. పిల్లలకు భాషా వినియోగం సందర్భాలను పరిచయం చేసి ఆయా సందర్భాల్లో పిల్లల వ్యక్తీకరణకు అవకాశం కల్పిస్తే ఫలితంగా పిల్లలు భాషా సామర్థ్యాన్ని పొందగలుగుతారు.
- పరస్పర సహకారమున్న సందర్భాల్లోనే భాషా సంపాదన జరుగుతుంది. (వైగొటస్కీ, బ్రూనర్) ఈ సన్నివేశాల్లోనే పిల్లలు, పరస్పర వైయక్తిక, అభివ్యక్తిలో పాలు పంచుకుంటారు.



SCERT TELANGANA

**భాషలో అందించే వనరులు - ఫలితాలు**

- ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు కొంత సహనం ఉండాలి. తమ పిల్లలకు పాఠం బోధనలో పిల్లలకు లభించిన భాషా విషయక Inputకు అనుగుణంగా Out put ఉండకపోవచ్చు. భాషాభ్యసనకాలంలో, కొంత నిశ్శబ్దానికి కూడా స్థానముంటుంది. పిల్లలు శారీరకంగా, జ్ఞానాత్మకంగా ఎప్పుడు సంసిద్ధులైతారో అప్పుడు Out put Input కన్న అధికంగా ఉంటుంది.
- భాషాభ్యసనంలో ఒక క్రమమంటూ ఉండదు. ఉదా: ధ్వనులు - వర్ణాలు - పదాలు - వాక్యాలు ఈ వరుసలో భాషాభ్యసనం జరుగదు. పిల్లలు సమగ్రమైన ప్రక్రియల్లో పాల్గొంటూ తమదైన ధ్వని, పద, వాక్య, అర్థ వ్యవస్థలను నిర్మించుకుంటారు.
- సులభం నుండి క్లిష్టత, క్లిష్టత నుండి సులభం అనే క్రమం భాషాభ్యసనంలో ఉండదు. తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు ఎవరూ సులభమైన వాక్యాలని, క్లిష్టమైన వాక్యాలని చెప్తూ పిల్లలతో మాట్లాడరు.
- సందర్భాని కనుగుణంగా పిల్లలు అసంఖ్యాకమైన పదాల అర్థాలు సొంతం చేసుకొంటారు. అర్థనిర్మాణ ప్రక్రియలో భాగస్వాములైతారు.
- పిల్లలు అసంఖ్యాకమైన వాక్యాలను సృష్టిస్తారు. ఇందుకు అవసరానుగుణంగా తెలిపిన పరిమితమైన పదజాలాన్నే ఉపయోగించుకొంటారు.
- పిల్లలకు సవాళ్లు విసరగల, సమగ్రమైన Input కావాలి. సమగ్రత అనేది ఒక మనో ప్రక్రియ (mental process) ఇతర భాషలను వినునపుడు పిల్లలకు ఎన్నో అంశాలు తోడ్పడుతాయి. (సందర్భం, భావ వ్యక్తీకరణ సామర్థ్యం, తెలిసిన పదాల, హావభావాలు మొదలగునవి)

* * *

SCERT TELANGANA

# 2. భాష - సమాజం - ఇతర అంశాలు

## భాష మరియు సమాజం

పిల్లలు సహజంగా భాసా సామర్థ్యాలతో జన్మించినప్పటికి ఆయా భాషలను వాటి సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ సందర్భాల్లో సంపాదిస్తారు. పిల్లలు ఎదుటి వ్యక్తులు, సమయం సందర్భానికనుగుణంగా భాషను ఉపయోగిస్తారు.

**'సమాజం వెలుపల భాష అభివృద్ధి కాదు' - *Aurorin***

అరోరిన్ అనుభాషా వేత్త అభిప్రాయంలో భాషకు, సమాజానికి మధ్య దగ్గరి సంబంధం ఉంది. సమాజం లేకుండా భాషలేదు. సమాజం మారితే భాష కూడా మారుతుంది. పిల్లలు అంతర్గత శక్తియుక్తులు మరియు సామాజిక పరిసరాలు మధ్య జరిగే పరస్పర సంక్లిష్ట చర్య ఫలితంగా భాష ఉపయోగపడుతుంది. భాషను సామాజిక వ్యక్తకరణకు ఉపయోగిస్తారు. సమాజవసరాల కనుగుణంగా భాష మారుతుంది. మానవ సంబంధాల మధ్య జరిగే వ్యవహారంలో భాష ప్రముఖపాత్ర పోషిస్తుంది. అట్లే భాష యొక్క popularity సామాజిక పరస్పర చర్యలు, వినియోగం మరియు విధులపై ఆధారపడి ఉంటుంది. ఒకే విధమైన ఆసక్తులు ఒకే విధమైన విలువయలు, విశ్వాసాలు గల ప్రతిభా సమూహాలతో సమాజం ఏర్పడుతుంది. ఈ క్రమంలో వారికి ఒక భాష అవసరమవుతుంది. భాష ప్రజలను దగ్గర చేస్తుంది. వారిని కలిపి ఉంచుతుంది.

## బహుభాషత్యము (Multilingualism)

మానవుని గుర్తింపులో బహుభాషత్యం ఒక అంతర్భాగం. సుదూరమైన గ్రామీణ ప్రాంతాలలో ఏకభాషీయుడైనా ఎక్కువసార్లు నూతన సందర్భాలను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు ఆయా భాషలకు చెందిన పదజాలాన్ని సులభంగా అర్థంచేసుకోగలుగుతాడు.

మన తరగతి గదులు సహజంగా బహుభాషలకు నెలవైనవి. అన్ని సమాజాల్లో వైవిధ్యభరితమైన వ్యక్తీకరణతో పలు సందర్భాల్లో సంభాషిస్తారు. అందువల్ల తరగతిలోని ఈ బహుభాషా లక్షణాన్ని బోధనకు అభ్యసనకు ఒక ఆటంకంగా భావించకుండా ఈ లక్షణాన్ని ఒక వనరుగా గుర్తించి దీనిని ఒక బోధన వ్యూహంగా ఉపయోగించుకోవాలి. తద్వారా పిల్లలు తమ జ్ఞానాత్మక నైపుణ్యాలకు పదును పెట్టుకొని ఉద్దేశిత భాషను సంపాదిస్తారు. అందువల్ల భాషా ప్రణాళిక రచనలో బహుభాషత్యము కీలకాంశం కావాలి. పిల్లలు సహజంగా తరగతుల్లో మాట్లాడే వారి వారి భాషలను గౌరవించాలి. ఒక వేళ పిల్లలు మాటలను వినక (లేక) పోతే వారు తమను దూరం చేసినట్లుగా తరగతి నుండి వెలివేసినట్లుగా భావిస్తారు. ఆ కారణంగా వారు తరగతిని మధ్యలోనే వదిలివేస్తారు. అట్లే యాంత్రికంగా సాంకేతికమైన, విసుగు కల్పించే వ్యాకరణాంశాలను బోధించకుండా ఈ బహుభాషలను ఉపయోగించి ఆయా భాషల నిర్మాణాన్ని బోధనలో ప్రతిబింబించవచ్చు.

**ఆంధ్రప్రదేశ్ బహుభాషత్యం :**

భారతదేశంలోని ఇతర రాష్ట్రాలవలనే ఆంధ్రప్రదేశ్ కూడా బహుభాషలు మాట్లాడే ప్రాంతం. వివిధ భాషా కుటుంబాలకు చెందిన పలు భాషలు ఈ రాష్ట్రంలో వాడుకలో ఉన్నాయి. వీటిలో ప్రధానమైనవి తెలుగు, ఉర్దూ మరియు ఆంగ్లం. వీటితో బాటు పలు గిరిజన భాషలు కూడా వాడుకలో ఉన్నాయి. విద్యా విషయకంగా ఆసక్తి, ఆదుర్దా ఉన్నవారందరూ ఈ భాషలపై ప్రత్యేక దృష్టి కనబరచాల్సిన అవసరముంది. కాని పలు విద్యావేత్తలు, అధ్యాపకులు ఆంధ్రప్రదేశ్‌లో ఆంగ్లం, తెలుగు భాషలే సమస్యలని భావిస్తారు. ఈ క్రమంలోనే మన విద్యా ప్రణాళిక, విషయ ప్రణాళిక, పాఠ్యపుస్తకాలు, తరగతి ప్రక్రియలు బహుభాషా వ్యవహర్తలను దృష్టిలో పెట్టుకొని సిద్ధం చేయాల్సిన అవసరముంది. ఈ బహుభాషిత్వాన్ని ప్రోత్సహించడం దానిని వినియోగించడం జ్ఞానాభివృద్ధికి, విద్యా విషయక ఉపలబ్ధిలో ధనాత్మక, సకారాత్మక పర్యవసానాలకు కారణమవుతుంది.

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు అధికార భాషయైనా ఇతర భాషలు కూడా భావ వ్యక్తీకరణకు ఉపయోగంలో ఉన్నాయి. కొలామీ, కోయ, కొండ, బంజారా, కువి, గోండి, సవర, ఒరియా వంటి భాషలను గిరిజన ప్రాంతాల్లో మాట్లాడుతున్నారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొమర్రాజు లక్ష్మణరావు , సురవరం ప్రతాపరెడ్డి, తూమాటి దోణప్ప, భద్రిరాజు కృష్ణమూర్తి, చేకూరి రామారావు, బూదరాజు రాధాకృష్ణ వంటి ప్రసిద్ధులైన భాషావేత్తలు, సాహిత్యవేత్తల పరిశోధనలు కూడా బహుభాషల విద్యా బోధన అమలులో ఉపయుక్తంగా ఉంటాయి.

**భాష - ఆలోచన :**

భాషముందా? ఆలోచన ముందా? అను ప్రశ్న వాస్తవానికి కఠినమైనది. భాష మరియు ఆలోచనలు ఓ విధంగా వైయక్తికాలు మరియు ఒక దానిని ఒకటి ప్రభావితం చేస్తాయి. భాషలేని ఆలోచనను మనం ఊహించగలమా? శిశువుల ఉద్వేగ పార్శ్వాలను భాష స్పర్శిస్తుంది. వాటిని క్రియాశీలం (activate) చేస్తుంది. అలా వ్యక్తి ఆలోచించడానికి, దానికి అనుగుణంగా ఏదో ఒకటి చేయడానికి, సామాజిక సందర్భంలో జీవితాన్ని గడపడానికి భాష తోడ్పడుతుంది. ఆలోచన భాషను చైతన్యశీలిగా చేస్తుంది.

- భాష మరియు ఆలోచన విడదీయరానిది. వీటి మధ్య గల సంబంధం వాస్తవానికి సంక్లిష్టమైనది.
- మన ఆలోచనా ప్రక్రియలకు భాష రూపాన్ని ఇస్తుంది. ఇంతకు ముందు అన్వేషణకు నోచుకోని ఎన్నో జ్ఞానతీరాలకు, ఊహాతీరాలకు మనల్ని భాష చేరుస్తుంది.
- ఒక తరం నుండి మరో తరానికి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భాష ద్వారానే సంక్రమిస్తాయి.

భాష ఆలోచనను రేకెత్తిస్తుంది. వైవిధ్యభరితమైన తార్కిక ఆలోచన సృజనాత్మకతకు దారితీస్తుంది. అందువల్ల పిల్లలను కొంగొత్త తీరులతో ఆలోచించడానికి అవకాశాలు కల్పిస్తే ఆ పిల్లలు పలు విధాలుగా, పలు సందర్భాల్లో భాషను వినియోగిస్తారు. ఉదా: పాటలు, పద్యాలు, వ్యాసాలు, కథలు మున్నగునవి రాస్తారు.

భాషాతరగతిలో విద్యార్థులు తమ ఆలోచనలను, సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి అవకాశాలుండాలి. తరగతిగది నియమాలు మరియు విద్యార్థి ఉపాధ్యాయుల సంబంధాలు పిల్లల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారి భాషా సామర్థ్యాలను అభివృద్ధి పరుస్తాయి.

**'భాష మరియు మాండలికం :**

భాష మరియు మాండలికాలకు సంబంధించి పలువురు భాషకు ప్రాధాన్యత ఇచ్చి మాండలికాన్ని అంతగా ఎదగని, సంకుచిత భాషారూపంగా పరిగణిస్తారు. భాష మరియు మాండలికాల మధ్య గల సంబంధాలపై అపోహలు దిగువ విధంగా ఉంటాయి.

- భాషలు ఏదో ఒక నియతవ్యాకరణ నియమాలను అనుసరిస్తాయి. వాటికి లిపి ఉంటుంది. మాండలికాలకు ఈ లక్షణాలుండవు.
- భాషను జనాభాలోని అధిక సంఖ్యాకులు మాట్లాడుతారు. మాండలికం పరిమిత సంఖ్యలోని ప్రజలు, స్థానికంగానే మాట్లాడుతారు.
- భాషను ప్రమాణీకరించి, సున్నితం (Sophisticate) చేసి సాహిత్యంలో, ప్రతికా రంగంలో, ప్రభుత్వం మరియు ఇతర కార్యాలయాలు, న్యాయస్థానాల్లో వాడుతారు. మరో వైపు మాండలికం పరిమిత ప్రాంతాల్లో కేవలం సంభాషణలకే పరిమితమవుతుంది.
- ఏమైనప్పటికీ, భాషాశాస్త్రవేత్తల దృష్టిలో భాషకు మరియు మాండలికానికి మధ్య ఎలాంటి భేదం లేదు. రెంటికీ వ్యాకరణం ఉంది. రెండూ ఆ నియమాలను పాటిస్తాయి.
- మాండలికాలకు కూడా లిపి రూపమీయవచ్చు. వాటికి వ్యాకరణం రాయవచ్చు. నిఘంటువులను కూర్చవచ్చు.
- ఏది మాండలికం, ఏది గ్రాంథికం అనేది కేవలం సామాజిక, రాజకీయ సమస్య మాత్రమే. భాష కూడా అన్ని హంగులు కల ఒక మాండలికమే అని అంటారు. (It has been said that language is only a dialect with an army and navy) అంటే అధికారంలో ఉన్నవారు, సంపన్నులైన వారు ఉపయోగించే భాషా రూపానికే వత్తాసు పెరిగి అది ప్రామాణిక భాషగా గుర్తింపుపొందుతుంది.

ఈ విధమైన సంక్లిష్ట సామాజిక, రాజకీయ ప్రక్రియలో, సౌకర్యాలు లభించని, సౌకర్యాలకు దూరంగా ఉన్న పిల్లలు భాషా విషయంగా ఇబ్బందులకు లోనవుతారు. వారి భాషలు ప్రామాణిక భాష మిషతో గుర్తింపుకు నోచుకోవు. ఇక ఉపాధ్యాయుడు స్వచ్ఛమైన ప్రామాణిక భాషా రక్షకుడినని భావిస్తాడు.

ఉపాధ్యాయులు కింది అంశాలను దృష్టి యందుంచుకోవాలి

- శిశువు ఎంతో భాషా నిధితో పాఠశాలకు వస్తాడు. తాను మాట్లాడే భాషకు సంబంధించిన అన్ని నియమాలను, వ్యాకరణాన్ని తెలిసియుంటాడు.
- తన మాతృభాష పాఠశాలలో మాధ్యమభాష కాక పోవడం అనేది శిశువుకు ఒక రాజకీయ సమస్య. కాని తన మాతృభాషలో ఏ విధమైన పొరపాట్లు చేయడు.
- ప్రామాణిక భాషాభ్యసనంలో శిశువు చేసే పొరపాట్లు తప్పులు కావు. అర్థరహితాలు కావు. ఆ తప్పులకు ఒక క్రమం ఉంటుంది. ఆ తప్పులు కాలక్రమంలో సవరణకు నోచుకుంటాయి. అభ్యసనంలో ఇవి అత్యవసరమైన సోపానాలు మాత్రమే.
- తప్పులు చేయకుండా ఏ శిశువూ భాషను నేర్చుకోలేడు. మరియు ప్రథమ భాషాభ్యాసకులు కూడా రెండో భాషను మరియు మూడో భాషను నేర్చుకోవడంలో ఇలాంటి పొరపాట్లే చేస్తారు.

**భాష మరియు లిపి :**

భాష ప్రాథమిక వ్యవహారశీలి (speech) వ్యవహారాన్ని అక్షరబద్ధం చేయుట ద్వారా లిపి ఏర్పడుతుంది. ఒక భాషకు దాని లిపికి మధ్య అంతర్గత సంబంధమంటూ ఏది లేదు. ఒక లిపి ఆ భాషా వ్యక్తీకరణకు ఉపయోగపడుతుంది. వాస్తవానికి ప్రపంచ భాషలన్నింటినీ ఏదో ఒక లిపిలో రాయవచ్చు. అట్లే ఒక భాషను ఎన్నో లిపుల్లో మార్పులకు చేర్పులకు లోబడి రాయవచ్చు. లిపి కన్న ముందునుండే భాష ఉంది. మరియు లిపి, భాషలు కొన్ని భాషా సాహిత్యం అభివృద్ధిలో ఎలాంటి పాత్రను పోషించవు. సమాజంలోని వ్యక్తులు, పెద్దలు, రాజకీయ వర్గాల వారి ఉపయోగంపై ఆ భాషా లిపి ఆధారపడుతుంది. ఈ భావనలతో అధికారంలోకి వచ్చిన వారిని బట్టి లిపులు మారుతాయని అర్థం చేసుకోవచ్చు. ఓ కాలంలో Perso-Arabic Scriptలో ఉన్న భాషలు ఈనాడు దేవనాగరి, గురుముఖి లేదా రోమన్‌లిపిలో రాయబడుతున్నాయి. ఈనాటి కాలంలోని ఉర్దూ పద్యసంపద (perso-arabic) లిపిలోనూ, దేవనాగరి మరియు రోమన్ లిపుల్లో లభిస్తోంది. సంబాలీ భాష ఐదు రకాల లిపిల్లో రాయబడుతోంది.

**రెండో భాషను నేర్చుకోవడం :**

ఇంతకు ముందే ప్రస్తావించినట్లుగా మానవులు తమదైన భాషా సామర్థ్యాలతో లక్షణాలతో జన్మించారు. ఈ భాషా లక్షణమే వారు ఎన్నో భాషలను ఏ కాలంలోనైనా తమ జీవిత కాలంలో నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. పిల్లలు కొత్త భాషలను త్వరగా నేర్చుకుంటారన్న మాట వాస్తవం. ఐతే ఏకరూపత గల ధ్వని వ్యవస్థలు గల భాషలు నేర్పడం చాలా సులభంగా త్వరగా జరుగుతుంది. ఇక పెద్దలు కొత్త భాషా పదాలను, వాక్యాలను మరింత త్వరగా సొంతం చేసుకొంటారు. ఆంధ్రప్రదేశ్‌లోని పిల్లలు హిందీ లేదా ఆంగ్ల భాషలను అభ్యసించాలనుకున్నప్పుడు సమస్యలు ఎదురవుతాయి.

ఈ సమస్యలు పిల్లల వైపు నుండి కావు పిల్లలవి కావు. సమస్యలు ఆ భాషల సామగ్రి, బోధన పద్ధతులు, ఉపాధ్యాయులు, పాఠశాలల్లో ఆ భాషల బోధనకు అభ్యసనానికి గల వసతి సౌకర్యాల వల్లనే ఉత్పన్నమవుతాయి. ఒక వేళ మనం సుసంపన్నమైన, రక్షిత, ప్రోత్సహించగల రెండో భాషా పరిసరాలను సమకూర్చగలిగే ఆ భాషను పిల్లలు సునాయాసంగా నేర్చుకొంటారు. సుసంపన్నమైన పరిసరాలు అంటే పిల్లలకు పలు భాషావినియోగ సందర్భాలను పరిచయం చేయడం అంటే కథలు, నాటికలు, హాస్యోక్తులు, ప్రకటనలు, పాటలు, గేయాలు మున్నగువాటి పరిచయం ద్వారా పిల్లలను ఆ భాషాభ్యసనంలో నిమగ్నం చేసి దాని వ్యవహారాన్ని విశ్లేషించగల సామర్థ్యాన్ని పిల్లలకు అలవరచవచ్చు. ఈ విధమైన పరిసరాలను సృజించడమే కొంత ఇబ్బందికరం. ఐతే అభ్యసించాల్సిన పిల్లల భాషా సంస్కృతిని, సంప్రదాయాలను గౌరవిస్తూనే, వాటిని సృజనాత్మకంగా బోధన ప్రక్రియలో ఉపయోగించుకుంటూనే రెండో భాషను అభ్యసించడానికి తగిన పరిసరాలను పాఠశాలల్లో ఏర్పర్చాల్సి ఉంటుంది. స్థూలంగా రెండో భాషాబోధన మొదటి భాషాభ్యసన పరిసరాలకు దగ్గరి పరిసరాల్లో జరిగితే ఆ భాష సులువుగా పిల్లల వశమవుతుంది. ఐతే ఇది కొంత కష్టతరమైన అంశం. ఐనప్పటికీ ఆ భాషల మధ్య దగ్గరి సంబంధాన్ని స్థాపించడం సాధ్యపడదా.

## భాష మరియు సమ్మిళిత విద్య (Language and Inclusive Education)

మానవులందరికీ ఏదో ఒక వైకల్యముందన్న విషయం ప్రత్యేకంగా ప్రస్తావించవల్సిందే. పిల్లలకు మరియు వృద్ధులకు ఇతరుల సాయం కావాలి. కొందరు పాడలేరు. కొందరికి వినికిడి శక్తి తక్కువ. కొందరికి మేధోపరమైన సమస్యలుంటాయి. నూటికి నూరుపాళ్లు వైకల్యరహితంగా, ఆరోగ్యవంతంగా ఉన్న వ్యక్తి అంటూ ఈ ప్రపంచంలో ఉండడు. ఇట్టి ప్రపంచాన్ని మనం సృష్టించుకున్నాం. కేవలం దృష్టి మాంద్యంగల వారికే కాక ప్రజలందరికీ మార్గాలు సుగమంగానే ఉండాలి. అందరికీ అందుబాటులో ఉన్న పాఠశాలలను అంటే శారీరక, దృష్టి, వినికిడి, వైకల్యాలున్న వారందరికీ పాఠశాలలు అందుబాటులో ఉండాలి. అందరు పిల్లలకు మేధోపరమైన ప్రతిభాపరంగా సుసంపన్నమైన, సంస్కృతి, పరిసరాలు గల పాఠశాలలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అట్లే భాషా వ్యవహార సమస్యలు గల పిల్లలకూ తగిన వసతులు పాఠశాలల్లో కల్పించాలి. వినికిడి సమస్య గల పిల్లలకు సంకేతాల భాష ఉంటుందని అది ఫ్రెంచి, జర్మన్, హిందీ, తెలుగు భాషల వలెనే వ్యవస్థీకృతమైనదని గుర్తించాలి. ఐతే అధికార వర్గాలు ఈ సంకేత భాషాబోధనకు ఏ విధమైన సౌకర్యాలు కల్గించుటలేదు. భాషా సంబంధ సామర్థ్యాలలో సమస్యలనెదుర్కొంటున్న పిల్లలందరికీ వారి బహు భాషలను గౌరవించి తరగతుల్లో ఉపయోగించే వాతావరణం కల్పించాలి. అట్లే మన తరగతుల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలుంటారు. ఇందుకు పలు కారణాలుంటాయి. వీటివల్ల వారు భాషాభ్యసనంలో వెనుకబడతారు. ఐతే దశాబ్దాల తరబడి జరిగిన పరిశోధనలు Inclusive అభ్యసన పరిసరాలు కల్పిస్తే ఈ సమస్యలకు గరిష్ట పరిష్కారాలను కనుగొనవచ్చునని నొక్కి చెప్తున్నాయి.

ఇలాంటి కష్టనిష్టూరాలపై ఆధారపడి ఎవరైనా వృత్తిపరంగా ప్రత్యేకమైన భాషావైకల్యం లేదా dyslexia ను diagnose చేయవచ్చు. APHD, హ్రస్వదృష్టి, వినికిడి లోపం మున్నగునవి భాషా సంబంధ సమస్యలకు దారితీస్తాయి. వీటిని అధిగమించడానికి తరగతులు Inclusive అభ్యసన పరిసరాలను కల్పించాలి.

సమ్మిళిత తరగతి గది అంటే పిల్లల అన్ని స్థాయిల భేదాలను దృష్టియందుంచుకొని బోధనాభ్యసన పరిసరాలను సృష్టించడం అన్నమాట. ఐతే కొందరు పిల్లలకు ప్రత్యేక సహాయం అవసరముండవచ్చు. వారికోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలి. వీలైనంత వరకు సామాన్య తరగతి గది నుండి ఏ పిల్లవాడినీ వెలుపలికి తీసుకొని పోరాదు. ఉదాహరణకు వినికిడి శక్తి లోపం గల వారికోసం సాధారణ తరగతిలో ఒక singer, సంకేత భాషలో వ్యవహరించే వ్యక్తిని నియమించవచ్చు. దృష్టిదోషమున్న పిల్లలకు బ్రెయిలీ లిపితో పాటు Jaws మాట్లాడే పుస్తకాల వంటి Software Programmes ను సాధారణ తరగతుల్లోనే ఉపయోగించవచ్చు. అంతేగాక ఈ వైకల్యాలు గల పిల్లలందరికీ (శారీరక వికలాంగులతో సహా) రాంపులు, మరుగుదొడ్లు, కూర్చోనే సౌకర్యాలు అందుబాటులో ఉంటే వారు భాషాభ్యసనంలో ఏమాత్రం వెనుకంజవేయరు.

**RTE 2009 మరియు భాషాంశాలు :**

పిల్లలకు ఉచిత నిర్భంద విద్యా చట్టం (RTE-2009) 2009 పిల్లలందరికీ అంటే 6 -14 సంవత్సరాల వయోపరిమితిలోని వారందరికీ ఉచిత నిర్భంధ విద్యనందించాలని నిర్దేశిస్తోంది. అంతేగాక నాణ్యత గల విద్యను ఉద్దేశిస్తోంది. RTE 2009 రాష్ట్రాలు తమ విద్యా ప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు, పరిగణన వ్యూహాలు (సమగ్ర నిరంతర మూల్యాకనం)ను నాణ్యమైన విద్యనందించడానికి సిద్ధం చేయాలని నొక్కి చెప్తోంది. ఈ సందర్భంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే అధ్యాపకులు, ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న ఛాత్రులు, తల్లిదండ్రులు, సమాజంలోని నాయకులు RTE 2009లో పొందుపరచిన భాషా సంబంధ విషయాలను అర్థం చేసుకోవాల్సిన అవసరముంటుంది.

RTE 2009-4 సెక్షన్ 8 (సి) ప్రకారం బలహీన వర్గాల వారి పిల్లలు, disadvantaged సమూహాల పిల్లలను ఏవిధంగానూ వివక్షతకు గురిచేయరాదు. వారు ఎలిమెంటరీ విద్యను పూర్తి చేయడాన్ని ఏ సందర్భంలోనూ ఆటంకపరచరాదు. ఈ చట్టం పిల్లలను భయం నుండి, truma నుండి ఉద్విగ్నతల నుండి దూరం చేయాలని వారు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించడాన్ని ప్రోత్సహించాలని చెపుతోంది (RTE 2009. section 29. 2g: 9) ఈ అంశం స్థానిక సంస్థలకు కూడా వర్తిస్తుంది (RTE 2009. section 9 (c) : 5)

ఈ చట్టం మాధ్యమ భాష విషయంలో కూడా సిఫార్సు చేసింది. మాధ్యమ భాష వీలైనంత వరకు పిల్లల మాతృభాష కావాలి. (RTE section 29. 2f.9) అందువల్ల పిల్లల మాతృభాషలను గౌరవించడం. వాటిని మధ్యమభాషలుగా విద్యా ప్రక్రియలో ఉపయోగించడం జరగాలి. భాషాభ్యసనంలో పిల్లలు ఏ విధమైన భయాలకు, ఉద్రిగ్తతలకు లోనుకాకుండా చూడాలి. వాస్తవానికిఈ కొత్త దృక్పథంపై ఉత్పన్నమయ్యే ప్రశ్నలకు చట్టంలోని కింది సెక్షన్‌లో సమాధానం లభిస్తుంది.

అధ్యాయం II సెక్షన్-4లో ఆరు సంవత్సరాల వయస్సు పైబడిన పిల్లల్లో ఎవరైనా పాఠశాలలో చేరకపోతే, చేరినా ఎలిమింటరీ విద్యను పూర్తి చేసుకోలేకపోతే అతడు ఆ వయస్సుకు తగిన తరగతిలో తప్పక ప్రవేశం కల్పించాలి. ఐతే వయోపరిమితికి అనుగుణంగా తరగతిలో ప్రవేశం పొందిన పిల్లలు తరగతిలోని



SCERT TELANGANA

ఇతర పిల్లలతో సమాన స్థాయిని పొందడానికి ప్రత్యేక శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది. ఇందుకు కాలపరిమితిని నిర్దేశించాలి. (RTE 2009:3)

పై సెక్షన్లననుసరించి ప్రత్యేక భాషా సమస్యలున్న పిల్లలు తరగతుల్లో ఉన్నట్లయితే ఉదా: వారు చదవడం, రాయడం చేయలేకపోతే వారికి ప్రత్యేక శిక్షణనందించాలి. వారిపై ప్రత్యేక దృష్టి కనబరచాలి. ఈ సమస్యలను అధిగమించడానికి తగిన బోధనాభ్యసన సామాగ్రి, మార్గదర్శకం సమకూర్చాలి.

ఇలా అన్ని సెక్షన్లు భాషా ప్రాతిపదికపై పిల్లలకు ఏ విధమైన విచక్షణకు లోను చేయరాదని నొక్కి చెప్తున్నాయి. బహుభాషా చట్రంలోని పిల్లందరి భాషలకు సమానమైన గౌరవ ప్రతిపత్తులను సమకూర్చడమే విద్యావ్యవస్థ యొక్క ఉద్ధేశ్యం కావాలి.

ఇక సెక్షన్ 29 అధ్యాయం 6 (RTE 2009:9 ) ప్రకారం విద్యా ప్రణాళిక మరియు మూల్యాంకన పద్ధతులు కింది అంశాలను దృష్టియందుంచుకోవాలి.

అ. రాజ్యాంగంలో పొందుపరచిన విలువలు.

ఆ. పిల్లల సర్వాంగీణ వికాసం.

ఇ. పిల్లల జ్ఞానాభివృద్ధి సామర్థ్యాలు, ప్రతిభను పెంపొందించుట.

ఈ. పిల్లలు శారీరక మానసిక శక్తులను సంపూర్ణంగా అభివృద్ధి చేయుట.

ఉ. స్నేహపూరిత వాతావరణంలో శిశుకేంద్రంగా పరిశోధన, అన్వేషణ కృత్యాల సహాయంతో అభ్యసనం.

ఊ. పిల్లల మాతృభాషలోనే విద్యాబోధన.

ఋ. భయంలేని, ఒత్తిడి లేని ఉద్విగ్నతలు లేని పరిసరాల్లో పిల్లల స్వేచ్ఛ భావవ్యక్తీకరణకు అవకాశాలు.

ౠ. పిల్లల జ్ఞానావగాహనలను, వినియోగ దక్షతను అంచనా వేయడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనము.

**నూతన దృక్పథం - తరగతి గది అన్వయం:**

భాషాపాటవానికి, బహుభాషిత్వానికి మధ్య దగ్గరి సంబంధముందని పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. విద్యావిషయక ఉపలబ్ధి, జ్ఞాన నిర్మాణం, సామాజికంగా సహనశీలతలు కూడా బహుభాషత్వాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల బహుభాషిత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముంటుంది. భాష వ్యక్తులు, సమూహాల మధ్య ఎదుగుతుంది. భాషలు కేవలం పాఠ్యపుస్తకాలకు నిఘంటువులకు, వ్యాకరణాలకు మాత్రమే పరిమితమవుతే అవి నిర్వీర్యమౌతాయి. పర్యవసానంగా మరణిస్తాయి. భాషలకు సరిహద్దులు అంటూ ఉండవు. అవి ఒకదాని నుండి మరో భాషలోకి చొచ్చుకొని పోతాయి. మనం తరుచుగా పలు సందర్భాల్లో ఇతర భాషా పదాలను, వ్యక్తీకరణాలను అరువు తెచ్చుకుంటూనే ఉంటాం. అందువల్ల జాతీయాలు, అనువాదం, రెండు భాషల పదాలను కలగలిపి వాడడం (Code mixing). మాతృభాష స్థానంలో

రెండో భాషా పదాలను వాడడం (Code switching) మున్నగు వాటిని సమర్థంగా ఉపయోగించుకొని పిల్లల భాషలను అభివృద్ధి పరచవచ్చు. ఈ భావన తరగతిలోని బహు భాషిత్వాన్ని ఒక వనరుగా ఒక బోధన వ్యూహంగా ఉపయోగించుకోవడానికి తోడ్పడుతుంది.

తరగతిలోని అందరు పిల్లల స్వీయ భాషలలో భాషా కృత్యాలను సులభంగా సిద్ధం చేయవచ్చు. వారి వారి భాషల్లో బహువచనాలు ఏర్పడే నియమాల, పద్ధతులను గుర్తించమని చెప్పవచ్చు. పిల్లలు చిన్న జట్లలో పనిచేస్తూ ఏకవచనం, బహువచనంలోని పదాలకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించవచ్చు. వీటి మధ్య గల సారూప్యతలను, భేదాలను వారు పరిశీలించవచ్చు. వారు వాటిని వివిధ వర్గాలుగా విడదీయవచ్చు. తద్వారా వచనాలు ఏర్పడే నియమాలను రూపొందించుకొని వాటిని మరింత సమాచారం కోసం పరీక్షించుకోవచ్చు. Code mixing, Code Switching మరియు అనువాదాలు మున్నగు వాటిలో పలు ప్రయోగాలు తరగతిలో చేయవచ్చు. వివిధ భాషలు వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ఈ తరగతులతో సుసంపన్నం చేయవచ్చు.

RTE 2009లోని విషయాలను, సిఫార్సులను పూర్తిగా అమలుకావడానికి వాటిని గౌరవించాలి. బలహీనవర్గాలు, అణగారిన వర్గాల వారిని ఏమాత్రం విచక్షణతో చూడకుండా వారంతా ఎలిమెంటరీ విద్యను పూర్తి చేసుకునేటట్లు చూడాలి. అట్లే బహుభాషలు, బహుళ సంస్కృతులు గల పిల్లలను పాఠశాలలో చేర్చి వారికి విద్యాబోధన జరపడానికి వ్యూహాలను పన్నాలి. బహుభాషా తరగతి గదులను విశ్లేషణాత్మక ఆలోచనలకు, జ్ఞానాభివృద్ధి తత్ఫలితంగా ఉన్నత ప్రమాణాలు గల విద్యా విషయక ఉపలబ్ధికి సహాయకాలుగా, వనరులుగా ఉపయోగించుకోవచ్చు.

* * *

# 3. భాషాభ్యసనం - ఫలితాలు

**పరిచయం**

సంప్రదాయంగా భాషాభ్యసన ఫలితాలను కేవలం శ్రవణ భాషణ పఠనలేఖన నైపుణ్యాల సాధనగానే, వాటిని వేరువేరు గానే పరిగణిస్తున్నాం. ఐతే మనం మరింత సమగ్ర దృక్పథంతో భాషాభ్యసన ఫలితాలను నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకు ఈ ఫలితాల సాధనకు భాషా బోధన సమగ్ర పద్ధతులలో కొనసాగాల్సి ఉంటుంది. పలు సందర్భాలలో మనం పిల్లలను వారు తమ భాషను వినియోగిస్తున్న సందర్భాలలోనే ఫలితాలను అంచనా వేయాలని భావిస్తుంటాం. ఈ భాషా వినియోగ సందర్భాల్లో (discourses) శ్రవణ భాషణ పఠన లేఖనాలే గాక సన్నివేశానికి సందర్భానికి అనుగుణమైన భాషోపయోగం మనకు కనబడుతుంది. అంతేగాక పలు దృశ్య, శ్రవ్య మాధ్యములైన చిత్రలేఖనము, రంగులువేయడం మున్నగునవి కూడా తమ భావవ్యక్తీకరణకు పిల్లలు ఉపయోగిస్తారు. ఇక భాషాభ్యసన ఫలితాలు ప్రధానంగా అవగాహనతో కూడిన పఠన లేఖనాలు కావాలి. అట్లే ఇతరుల మాటలను ఓపికతో వినడం, అర్థం చేసుకోవడం, అనుగుణంగా ఇబ్బంది లేకుండా తడబడకుండా ఆత్మవిశ్వాసంతో బదులు చెప్పడం పిల్లలు చేయగల్గాలి. అందువల్ల భాషాబోధన కార్యక్రమాల్లో మొదట పిల్లల మాతృభాష పాటవాన్ని పెంపొందించడానికి ప్రాధాన్యత కల్పించాల్సి ఉంటుంది. ఈ లక్ష్యం నెరవేరితే పిల్లలు మరింత ఉన్నత శ్రేణి పాటవాన్ని తమ భాషతోబాటు ఇతర భాషల్లో కూడా సాధిస్తారు.

**ఆశిస్తున్న ఫలితాలు / లక్ష్యాలు :**

ఈ పత్రంలో సూచించిన భాషాభ్యసన కార్యక్రమాల ఫలితంగా పిల్లలు ఎలిమెంటరీ విద్యను పూర్తిచేసుకొనేనాటికి కింది ఫలితాలను కనబరచాలి.

- **వినుట, అర్థం చేసుకొనుట మరియు మాట్లాడుట**

పిల్లలు ఇతరులను వినడం, విన్నది అర్థం చేసుకోవడం, అనుగుణంగా ప్రతిస్పందించడం, ఈ ప్రతిస్పందన సందర్భోచితంగా, స్థల, కాల, వ్యక్తి, శీర్షిక కనుగుణంగా ఉంటాయి. ఆ తర్వాత జరుగబోయే లేదా వినబోయే, లేదా చెప్పాల్సిన అంశమేదో ఊహించగల్గాలి. పిల్లలు పలు భాషావినియోగ సందర్భాల్లో పాల్గొని తమ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తీకరించగల్గాలి. చిన్న చిన్న విషయాలకు ఏమాత్రం కోపగించకుండా, కృంగిపోకుండా, తార్కికంగా వారు భాషను వివిధ సందర్భాల్లో ఉ పయోగించగలగాలి.

- **తగు విధంగా మాట్లాడటం**

మాట్లాడటం సాధారణంగా ఒక యాంత్రికచర్యగా ప్రాథమిక తరగతుల్లో నిర్వహించబడుతుంటుంది. పిల్లలు ఈ తరగతుల్లో గేయాలు, పద్యాలు ఉపాధ్యాయుల నుండి విని వెంటనే వాటిని తిరిగి చెప్తుంటారు. అట్లే ఉపాధ్యాయులు తరగతిలోకి ప్రవేశించగానే నమస్కారాలు (good morning) చెప్పడం కూడా మనం గమనించవచ్చు.



SCERT TELANGANA

అయితే పిల్లలు వ్యక్తులను, చెప్పదలుచుకున్న అంశాన్ని, ప్రదేశాన్ని, సందర్భాన్నిబట్టి భాషను ఎలా ఉపయోగించుకోవాలో సంపూర్ణంగా తెలిసివుంటారు. పిల్లల్లో గల ఈ సహజ సామర్థ్యాన్ని పాఠశాలలో పెంచిపోషించాల్సి ఉంటుంది.

- **చదవడం అర్థంచేసుకోవడం**

పిల్లలు కేవలం పాఠ్యపుస్తకాలు పఠనానికే పరిమితం కారాదు. వారు తమ స్థాయికి తగిన ముద్రితాంశాలన్నింటిని చదివి అర్థం చేసుకోగల్గాలి. పాఠశాల పిల్లల పఠనాభిరుచిని ఉన్నత శ్రేణికి తీసుకొని వెళ్లాలి. పఠనావగాహాన్ని సమర్థం చేయాలి. ఇది కేవలం అర్థవంతమైన, ఆసక్తికరమైన, సవాళ్ళు విసర గల పాఠాల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. వైవిధ్యభరితమైన పాఠాలు పిల్లలకు పరిచయం కాకపోతే వారు పాఠ్యపుస్తకాల కతీతమైన ప్రగతిని సాధించలేరు. తద్వారా పిల్లలు పాఠ్యాంశ విషయములను తార్కికంగా విశ్లేషించి దానిని flow chart ల రూపంలో ప్రదర్శించగల్గుతారు.

- **లేఖనం**

పలువురు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పిల్లలు పాఠశాలకు వచ్చిన తర్వాతనే రాయడం నేర్చుకుంటారని భావిస్తారు. వాస్తవానికి అంతకు ముందే నుండే పిల్లలు తమకు తోచిన విధంగా రాస్తూ ఉంటారు. ఐతే ఈ రాత చిత్రాలు, బొమ్మలు, సంకేతాలు,వర్తులాలు, గీతల రూపంలో ఉండవచ్చు. పిల్లల్లో గల ఆసక్తిని పాఠశాలల్లో ప్రేరేపించి వారు స్వేచ్ఛగా రాయడాన్ని ప్రోత్సహించాలి. తద్వారా మరింత వేగంగా రాత నేర్చుకుంటారు. ఇక ప్రాథమిక తరగతుల్లో పిల్లలు రాతలో చేసిన దోషాలపై ఎక్కువ దృష్టి పెట్టక మరింతగా రాయడాన్ని ప్రోత్సహిస్తూ వారి దోషాలను వారే గుర్తించేట్లు చేయగల్గాలి. రాత ఒక యాంత్రిక నైపుణ్యం కాదని, ఇది ఒక సృజనాత్మక కృత్యమని భావించాలి.

- **పదజాలం**

పదాలను సందర్భం లేకుండా తెలుసుకోరాదు. దురదృష్టవశాత్తు ఈనాడు సందర్భరహితంగా పదజాలాన్ని నేర్పుతున్నాం. పదాలకు అర్థాలు సందర్భానుగుణంగా ఉంటాయి. అందువల్ల సందర్భానుగుణంగా అర్థాలను బోధించాలి. అట్లే మదింపు వేయాలి. వివిధ సంరద్భాల్లో ఒకే పదం వేరు వేరు అర్థాలిస్తుంది. పిల్లల్లో అట్లే సుసంపన్నమైన పదజాలాభివృద్ధి భాషాబోధనలో భాగం కావాలి. ఐతే పిల్లలు పదాల అర్థాలను సందర్భానుగుణంగా ఊహించడాన్ని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

- **సృజనాత్మక వ్యక్తీకరణ**

కల్పనాత్మక, సృజనాత్మక వ్యక్తీకరణకు, పిల్లల్లో పలు సామర్థ్యాలున్నాయి. వారికి మౌఖికంగానూ, లిఖిత రూపంలోనూ తమ సృజనాత్మక వ్యక్తీకరణకు అవకాశాలు కల్పించాలి. పిల్లలు తమంత తాముగా కథలు అల్లడం, పాటలు కూర్చడం, సంభాషణలు చెప్పడం, ఉత్తరాలు రాయడం, కరపత్రాలు, స్వీయ రచనలు, పద్యాలు, ప్రకటనలు, పోస్టర్లు, చిట్టి నాటికలు రాయడాన్ని ప్రోత్సహించాలి. కొందరు పిల్లలు కలిసి తమదైన ఒక నాటికను రాసి ప్రదర్శించుటకు అవకాశాలు కల్పించాలి. పుస్తక సమీక్షలు కార్యాచరణ వివరాల నివేదికల రచన, చర్చలు, జట్లు కృత్యాల్లో పాల్గొనుట. వక్తృత్వంలో పాల్గొనుట మున్నగునవి పిల్లల సృజనాత్మక వ్యక్తీకరణకు దర్పణాలౌతాయి.

- **సౌందర్యాత్మక స్పృహ - సామాజిక బాధ్యత**

బహుళ భాషా పరిసరాలున్న తరగతుల్లో అభ్యాసకులు సౌందర్యాత్మక స్పృహను పెంపొందించుటను ఒక ప్రధానమైన భాషాబోధన ఫలితంగా మనం గుర్తించాలి. తద్వారా వారు భాషా నిర్మాణం, లయ మున్నగునవి గ్రహించగల్గుతారు. అట్లే తమ తోటి పౌరులు, ప్రజల అవసరాలపట్ల సామాజిక స్పృహ కల్గి బాధ్యతతో వ్యవహరించగల్గాలి.

- **సౌందర్యాత్మక స్పృహ**

భాషా తరగతి గదులు పిల్లలకు పలు భాషా సమాజ సంస్కృతులను పరిచయం చేయడానికి తోడ్పడుతాయి. అట్లే పిల్లలు పలు భాషల ఎడ, ఆ భాషా సంస్కృతుల ఎడ స్పృహను పెంపొందించుకుంటారు. ఎలిమెంటరీ విద్యను పూర్తి చేసే నాటికి పిల్లలు పద్య రచనలను కథలను, పాఠ్యాంశాలను ప్రశంసించగల్గాలి. అట్లే ఆయా అంశాలలో నిబిడీకృతమైన అంశాలపై తార్కికంగా ప్రశ్నించగల్గాలి.

- **సామాజిక బాధ్యత**

వాస్తవానికి సామాజిక శాస్త్రాల బోధన పాఠశాల బోధనాంశాల్లో ఒక సవాలు వంటిది. ఈ అంశాలు పూర్తిగా అమూర్తాలు. అందువల్ల వీటిని మనం పిల్లల నిత్య జీవిత అనుభవాలతో సమన్వయించలేం. అందువల్ల సామాజిక శాస్త్రాల బోధనకు అర్థవంతం చేయాలంటే,వాటి ఎడ పిల్లల్లో స్పృహను పెంపొందించాలి. ప్రాథమిక దశలో భాషాతరగతిలో కథలు మున్నగు అంశాల బోధన ఈ అంశాల ఎడ స్పృహను పెంపొందించడానికి తోడ్పడుతుంది.

- **Metalinguistic awareness (అధిభాషా స్పృహ)** :

అధిభాషాస్పృహ అంటే భాషను గురించి వివరించే పదజాలంపై అవగాహన కలిగి ఉండడం ఉదాపరణకు భాషకు చెందిన పదజాలం అనగా కర్త, కర్మ, క్రియ, త్వార్థకం, సమాసం, సంధి, వ్యుత్పత్తి అర్థం, ప్రతిపదార్థం, సారాంశం, అలంకారం, రచనాశైలి మొదలగునవి. అచేతనమైన భాషా జ్ఞానానికి సంబంధించిన చేతనాత్మక స్పృహకు, భాషా పాటవానికి మరియు విద్యా విషయక ఉపలబ్ధికి గరిష్ట సంబంధముందని ఇటీవలి పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఒక బహుళభాషా తరగతి భాష పనిచేసే విధానాన్ని అర్థంచేసుకోవడానికి ఉపకరిస్తుంది. ఉదాహరణకు పిల్లలు అనుకోకుండానే వ్యతిరేకార్థక బోధన వాక్యాలను తాము ఒకే విధంగా కూరుస్తున్నామని గ్రహిస్తారు. వ్యాకరణ సూత్రాలను కేవలం కంఠస్థం చేయకుండా పిల్లలు శాస్త్రీయంగా భాషా నియమాలు, ధ్వనులు, పదాలు, వాక్యవ్యవస్థలను స్పష్టంగా పరిశీలించి సొంతం చేసుకోగల్గాలి.

* * *



SCERT TELANGANA

# 4. బోధనాపద్ధతులు - పాఠ్యపుస్తకాలు - అభ్యసన సామగ్రి

**పరిచయం**

శిశువు పాఠశాలల్లో ప్రవేశించే నాటికే తన ఇల్లు, పరిసరాల్లోని భాషపై సంపూర్ణ సాధికారిత కల్గి ఉంటాడు. ఇంతకు ముందే ప్రస్తావించినట్లుగా శిశువు భాషా సంబంధిత నియమాల, ధ్వనులకు సంబంధించి సమగ్రం కాకపోయినా కొంత విస్పష్టమైన జ్ఞానాన్ని కల్గి ఉంటాడు. అట్లే శిశువు ఆలోచనాత్మకంగా, తగిన విధంగా, భాషను ఎలా వినియోగించాలో తెలుసుకొని ఉంటాడు. కాని పాఠశాలలో చేరినతరువాత వారు కొత్త భాషలకు తగినంత స్థాయిలో అభ్యసించడానికి వెనుకంజవేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కొత్తభాష నేర్చుకోవడంలోనే కాకుండా వారికి ఇంతకు ముందే పరిచయమైన భాషలో కూడా పఠనం, లేఖన సామర్థ్యాలపై తగినంత సాధికారత కల్గి ఉండరు. అంతేకాకుండా పలు అవ్యక్త అవసరాలకు తనకు తెల్సిన భాషా విషయాలనుకూడా ఉపయోగించలేరు.

పై కారణాల వల్ల మనం పిల్లలకు చేసే భాషా బోధనలో ఏదో ఒక చోట దోషముందని చెప్పవచ్చు. వాస్తవానికి ఈ విషయంలో మనం కింది ప్రశ్నలు వేసుకోం.

- పిల్లలు ఏయే భాషలను పాఠశాలకు తీసుకువస్తారు? (పలు సందర్భాల్లో పిల్లలు ఉపయోగించే భాషల గురించి ఉపాధ్యాయులు తెలుసుకోరు.)
- భాషా పాటవాన్ని పెంపొందించడానికి, meta lingusitic - అధి భాషాస్పృహను పెంపొందించడానికి, భాషా వినియోగ సందర్భాల అన్వేషణలో పిల్లల భాషను ఉపయోగించి మనం బోధించడానికి మార్గాలున్నాయా?
- పిల్లలు ఆ భాషలను ఎలా అభ్యసించి యుండవచ్చు.
- పిల్లలు ఏ భాషా విషయక జ్ఞానాన్ని పాఠశాలకు తెస్తారు.

పై విషయాల వల్ల పిల్లలు సహజ పరిసరాలు, సన్నివేశాల్లోనే భాషలను సంపాదిస్తారని మనం గ్రహించవచ్చు. ఐతే ఈ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండాలి సందర్భాలు, సన్నివేశాలు అర్థవంతంగా ఉండాలి. పిల్లలకు రక్షణ కల్పించేవిగా ఉండాలి. తరగతిలో ఉపయోగించే బోధన ప్రక్రియలు కూడా ఈ పరిసరాలకు వీలైనంత దగ్గరగా ఉండాలి. పిల్లలకు ఆసక్తిగొల్లేవి, సృజనాత్మకతను పెంపొందించే సందర్భాలతో కూడిన పాఠ్యాంశాలు కాక కేవలం విసుగు జనించే నీతి బోధ పాఠ్యాంశాలను చేర్చి, పిల్లలు కంఠతా పట్టడాన్ని ప్రోత్సహిస్తున్నాం. అట్లే అభ్యాసాలు కూడా ఆనవాయితీ అభ్యాసాలతో నిండి ఉంటున్నాయి. స్థానిక పఠనావగాహన సన్నివేశాలు, పదజాలానికి అర్థాలు, వ్యాకరణాభ్యాసాలు, కొంత రాత పని మాత్రమే ఈ అభ్యాసాల్లో చోటు చేసుకుంటున్నాయి. సాధారణంగా ఈ విధమైన సహజ భాషా అభ్యసన సన్నివేశాలు పిల్లలకు ఏ మాత్రం ప్రయోజనం కల్పించవు.

కొత్త సన్నివేశాలు కనుగొనడం,  ఆ సన్నివేశాల్లో తమ భాషా సామర్థ్యాలను ప్రయోగించడం పిల్లలు కోరుకుంటారు. కొత్త వారితో పిల్లలు కొత్త విషయాలు మాట్లాడుతారు. కొత్త వాక్యాలు నిర్మిస్తారు. ఆటపాటల్లో నిమగ్నమవుతారు. ఇలాంటి సన్నివేశాల్లో పిల్లలను మనం పరిశీలిస్తే తమ భాషా పాటవంతో పిల్లలు ఎన్నో కృత్యాలు నిర్వహిస్తారు. పిల్లలు ఒక పదం చేర్చరాని సందర్భాల్లో దానిని ఉపయోగిస్తారు. ఐతే ఈ విధమైన ఉపయోగం పెద్దలలో కనిపించదు. పిల్లలు అన్ని వేళల్లో ఎన్నో కొత్త వాక్యాలు నిర్మిస్తారు. ఆశ్చర్యకరంగా తమకు  తెల్సిన భాషలకు వాటికి కలగాపులగంగా మాట్లాడుతారు. మరో వైపు తనదైన భాషా శైలిని కాపాడుకొంటారు కూడా. తల్లిదండ్రులు బెంగాల్, పంజాబు ప్రాంతం వారై హైద్రాబాద్‌లో నివసిస్తున్న, సందర్భంలో పెరుగుతున్న పిల్లలు తమ తల్లులతో బెంగాలీలో, తండ్రితో పంజాబిలో, స్నేహితులతో ఉర్దూ లేదా తెలుగులో మాట్లాడటాన్ని కూడా మనం గమనించవచ్చు.

పై విషయాలకనుగుణంగా తగిన పద్ధతులను, సామగ్రిని రూపొందించడానికి కింది అంశాలు దృష్టియందుండాలి.

- భాష స్వభావము
- శిశువు భాషా పాటవము, సామర్థ్యము
- తరగతి గదుల్లోని బహుభాషా సన్నివేశాలు
- ఆశించిన ఉపలబ్ధి ఫలితాలు/ విద్యా విషయక ప్రమాణాలు
- NCERT, NCF-2005 సూచించిన మార్గదర్శ సూచనలు మరియు భాషా ఆధార పదాలు

  (కంఠతా పట్టే అభ్యసనాన్ని నిరుత్సాహ పరుచుట, అర్థవంతమైన బోధనాభ్యసన ప్రక్రియలను మరియు భాషా నిర్మాణం, జ్ఞాన పర్యవసానాలు, నిర్ణీత పాఠ్యపుస్తకానికే అభ్యసనం పరిమితం కాకుండుట, బహుళ పాఠ్యపుస్తకాల ఉపయోగం, అదనపు పఠనసామాగ్రి, స్వేచ్ఛా పూరిత అభ్యసన పరిసరాలు, మరియు పరిగణన మొదలగునవి.)

- RTE-2009 మార్గదర్శకాలు.

  (వివక్షలేని తరగతి గదులు, రాజ్యాంగ విలువలు, పిల్లల  సర్వాంగీణ వికాసం, సామర్థ్యాల పెంపుదల, నిరంతర సమగ్ర మూల్యాంకనం.)

**బోధనాభ్యసన కృత్యాలు - వ్యూహాలు**

పై చర్చల ననుసరించి

- సహజమైన భాషాభ్యసన సన్నివేశాల కల్పనకు అన్ని చర్యలు చేపట్టాలి.



SCERT TELANGANA

- పిల్లలు తమ స్వభాషను తరగతుల్లో ఉపయోగించడానికి అనుమతించాలి. వారికి ఎన్ని భాషలైనా అభ్యసించే శక్తియుక్తులున్నాయని గ్రహించాలి. నిర్ణీత వ్యవధిలో బోధించే భాషను అభ్యసిస్తారని దృష్టియందుంచుకోవాలి.
- పలు సందర్భాలలో పిల్లల భాషా వినియోగాన్ని ప్రోత్సహించాలి. తద్వారా వారు ఆలోచనాత్మకంగా భాషను ఉపయోగించగల్గుతారు.
- భాషా బోధన ఒక holistic (సమగ్ర) దృష్టితో సాగాలి. బోధనలో సంభాషణలు, చర్చలు, పద్య పఠనం, కీలకాంశాలు కావాలి. విడిగా పదాలు, వాక్యాలను వీలైనంత వరకు బోధనలో పరిహరించాలి.
- వ్యాకరణాన్ని ప్రత్యేకంగా బోధించరాదు. దీనిని పాఠ్యసందర్భాలకు అన్వయించి బోధించాలి. భాషా పరిశీలనలు, విశ్లేషణలు తరగతి బోధనలో చోటుచేసుకోవాలి.
- అనువాద కృత్యాలు, చర్చలు, సమస్యల ప్రశిన, ప్రశ్నల నిర్మాణం మున్నగునవి కృత్యాలు, ప్రకల్పన (projets) లో భాగం కావాలి. తద్వారా బహుభాషా తరగతులలో భాషా సామర్థ్యాలను పెంపొందించాలి.
- అన్ని కృత్యాలు పిల్లల బహుళ, వైవిధ్య స్థాయిలను దృష్టియందుంచుకోవాలి. ప్రతి కృత్యం అందరు పిల్లలు చేయగల్గేదిగా ఉండాలి.
- తమకు గల అంతర్గత శక్తియుక్తులు, సుసంపన్నమైన పరిచయం వల్ల పిల్లలు మౌఖిక భాషా వ్యవస్థలను సహజ పరిసరాలు ప్రత్యేకంగా వేరుచేయగల్గుతారు. అట్లే మౌఖిక, లిఖిత విషయాల్లో కూడా వారు ప్రత్యేకతను కనబరుచగల్గుతారు. ఇందుకు సహజభాషా అభ్యసన సన్నివేశాలను మనం కల్పించాల్సి ఉంటుంది.
- పిల్లలు తమ సమవయస్కుల జట్లలో ఎంతో అభ్యసిస్తారు. అందువల్ల తరగతిలో జట్టు కృత్యాలను ప్రోత్సహించాలి.
- మేథోమథనం, సమూహపఠనం, చర్చలు, నివేదికలు, ప్రతిస్పందనలు, ప్రత్యుత్తరాలు, గోడ పత్రికలను రాయుట, కొరియోగ్రఫీ, నాటకీకరణ, తోలుబొమ్మలు, ప్రాజెక్టు పనులు మున్నగునవి బహుళస్థాయి పిల్లల భాషాభ్యసనానికి దోహదం చేస్తాయి.
- ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలతో పాటు పలు వైవిధ్య పూరిత పాఠ్యాంశాలను తరగతి గదుల్లోకి తేవాలి. ఇందుకు సంకోచించరాదు. ప్రపంచ వ్యాప్తంగా లభిస్తున్న పాఠ్యసామాగ్రిని వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకోగల్గాలి. ప్రకటన, వార్తా ప్రకటనలు, ప్రకటనల బోర్డులు, లేబుళ్ళు మున్నగునవి వాటి నుండి ఎంతో సమాచారాన్ని పిల్లలకు అందించవచ్చు.



SCERT TELANGANA

**పాఠ్యపుస్తకాలు - భాషావనరులు :**

NCF 2005, భాషాభ్యసనం కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కారాదని ఇతర సామాగ్రిని కూడా ఉపయోగించుకోవాలని ప్రతిపాదించింది. అట్లే శిశు కేంద్రీకృత బోధనాభ్యసన వ్యూహాలను, బహుభాషా తరగతులు ఉపయోగించుకోవాలని సిఫార్సు చేసింది. తరగతి గదిలో పిల్లలు మాట్లాడే భాషలను పరిగణనలోకి తీసుకోవాలని కూడా సూచించింది. పాఠ్య పుస్తకాలతో బాటు పరామర్శగ్రంథాలు, మూలగ్రంథాలు పాఠశాల గ్రంథాలయాల్లో ఉండాలి. RTE 2009 సూచించిన సూచనలు ప్రమాణాలననుసరించి ప్రతి పాఠశాలలో ఒక గ్రంథాలయం ఉండాలి. కాలానుగుణంగా దీనిని అభివృద్ధి పరచాలి. వీటితో ప్రత్యేక సామాగ్రిని, సాంకేతిక సామాగ్రిని సమకూర్చి వైకల్యం గల పిల్లలకు కూడా భాషాభ్యసనాన్ని సులభం చేయాలి. బ్రెయిల్ లిపిలోని పుస్తకాలను గ్రంథాలయాలకు సమకూర్చుటతో బాటు డిజిటల్ రూపంలోని పాఠ్యాంశాలను కూడా వీటికి చేర్చాలి.

**1. పాఠ్యపుస్తకాలు :**

**భాషా వాచాకాలకు కింది లక్షణాలుండాలి**

- ఎంపిక చేసిన పాఠ్యాంశాలు పిల్లల జ్ఞానాత్మక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యాలకనుగుణంగా ఉండాలి.
- ఇది తరగతి వారీగా ఆశిస్తున్న విద్యా విషయక ప్రమాణాలను, అభ్యసన ఫలితాలను భాషా సామర్థ్యాలను సాధించడానికి అనువుగా ఉండాలి.
- ప్రాథమిక తరగతుల పాఠ్యపుస్తకాల్లో ఆలోచనలు రేకెత్తించే చిత్రాలు, పిల్లల పరిసరాలను ప్రతిబింబించే చిత్రాలుండాలి. నాణ్యమైన కాగితం, అందమైన ముద్రణతో పలు చిత్రాలతో కూడా ఉండాలి.
- వాచకాల్లోని భాష సులభంగా ఉండాలి. సృజనాత్మకతకు వీలుగా ఉండాలి. పిల్లలు తమ స్వభాషలను ఉపయోగించుటకు అనువుగా ఉండాలి.
- తరగతి వారిగా నిర్దేశించిన పలు కృత్యాల్లో పాల్గొనడానికి వీలుగా వాచకాల్లో పలు అభ్యాసాలుండాలి.
- వాచకాల్లోని పాఠాలు, పాటలు, పద్యాలు, కథలు, స్వీయచరిత్రలు, వ్యాసాలు, లేఖలు, సంభాషణల రూపంలో ఉండాలి. ఈ అంశాలన్నీ పిల్లల్లో ఆసక్తిని, ఉత్సుకతను, ఆలోచనలను పెంపొందించి భాషాభివృద్ధికి తోడ్పడుతాయి.
- ఎలిమెంటరీ స్థాయిలోని పాఠాలు ప్రాచీన, ఆధునిక సాహిత్యం నుండి ఎంపిక చేయాలి. ఈ పాఠాలు విద్యార్థుల వయోపరిమితులకు అనువుగా ఉండాలి. ఈ పాఠాలు రాజ్యాంగంలో పొందుపరచిన కీలకభావనలకు భిన్నంకారాదు. ఇవి మన లౌకిక భావనను, రాజ్యాంగ విలువలను గౌరవించే

SCERT TELANGANA

విధంగా ఉండాలి.

- ఎంపిక చేసిన పాఠాలు అన్ని ప్రాంతాలు, కులాలు, అన్ని భాషా ప్రక్రియలకు చెందినవై యుండాలి.
- స్వీయ అభ్యసనాన్ని ప్రోత్సహించే అభ్యాసాలకు ప్రాధాన్యత కల్పించాలి.
- భాషాభ్యాసాలు కృత్యాల రూపంలో ఉండాలి. అన్వేషణకు, పరిశోధనకు, పరిశీలనకు తోడ్పడాలి. వాటిలో క్విజ్‌లు, ప్రహేళికలు, భాషా క్రీడలు ఉండాలి.
- స్వీయ మూల్యాంకనం సాయంతో పిల్లలు తమ ప్రగతిని తామే మదింపు చేసుకొనుటకు పాఠ్యపుస్తకాల్లో చోటు కల్పించాలి.
- పిల్లలకు విసుగు కల్పించకుండా, మూసపద్ధతిలో లేని, ఆలోచనలు రేకెత్తించే ప్రశ్నలతో కూడిన పాఠాలుండాలి.
- పాఠ్య సన్నివేశాల కనుగుణమైన చిత్రాలుండాలి. ఈ చిత్రాలు పిల్లల సృజనాత్మకతను, కల్పనా శక్తులను అభివృద్ధి చేయాలి.
- వాచకాల్లోని అభ్యాసాలు పిల్లల తరగతి కృత్యాలు, జట్టు కృత్యాలు, వైయక్తిక కృత్యాలకు వీలుగా ఉండాలి.
- అభ్యాసాలు ఆలోచనలు రేకెత్తించేవిగా ఉండాలి. అన్వేషణకు ప్రాధాన్యత ఇచ్చేవి కావాలి. యాంత్రికమైన సమాధానాలను ఆశించే కృత్యాలను అభ్యాసాలుగా ఇవ్వరాదు.
- పిల్లలు అదనపు పఠన సామాగ్రిని ఉపయోగించడానికి వాచకాల్లోని అభ్యాసాలు ప్రోత్సహించాలి. తద్వారా పిల్లలు వ్యక్తిగతంగా పాఠకులుగా ఎదగగలుతారు.
- పాఠ్య సందర్భానికి అనుగుణంగా పిల్లలు పదాలు అర్థాలను గ్రహించాలి. ఈ అంశంపై ఆధారపడిన పదజాల అభ్యాసాలు/వాచకాల్లో చేర్చాలి.
- వాచకాల చివర అకారాది క్రమంలో పదపట్టికలు ఇవ్వాలి. వీటికి అర్థాలు కూడా ఇవ్వాలి. తద్వారా నిఘంటువును సంప్రదించే నైపుణ్యంతో బాటు అధ్యయన నైపుణ్యాలు కూడా పిల్లలకు అలవడతాయి.
- సందర్భానుగుణమైన వ్యాకరణాంశాలపై అభ్యాసాలుండాలి. ఇవి పిల్లలు స్వయంగా వ్యాకరణ నియమాలను తయారు చేసుకోవడానికి తోడ్పడాలి. ఈ సందర్భంలో పిల్లల స్వీయ భాషలను ఉపాధ్యాయుడు విరివిగా ఉపయోగించుకోవాలి.



SCERT TELANGANA

- **అభ్యాసాల్లో కింది రూపాలను చేర్చవచ్చు**
    - పద్య పూరణం
    - కథా పూరణం
    - కథలకు ముగింపు చెప్పడం
    - సంభాషణలు రాయడం
    - తోలు బొమ్మల ఉపయోగం
    - నాటకీకరణం
    - ఏకపాత్రాభినయం
    - సమీక్షలు
    - వర్ణనలు
    - వివరణలు
    - అనువాదాలు
    - ప్రాజెక్టు కృత్యాలు
    - పొడుపు కథలు
    - సాంస్కృతిక గేయాలు
    - సామెతలు
    - జాతీయాలు మున్నగునవి
- పూర్వ ప్రాథమిక దశలోని ప్రారంభకులైన పిల్లలకు నిర్దేశించిన పుస్తకాలలో భాషను Isolated linear మరియు fragmented mode అక్షరాలు (in sentences in isolation) పరిచయం చేయరాదు. అట్లే ఆధునిక భాషావేత్తలు అక్షరాలను అర్థవంతమైన సన్నివేశాల్లో పరిచయం చేయాలని సూచించారు. ఇందుకు సందర్భం - భాషాసన్నివేశం - వాక్యాలు పదాలు - అక్షరాల పరిచయ పద్ధతిని ఉపయోగించాలి.
- భాషా వాచకాలు స్థానిక సంప్రదాయాలు, సంస్కృతిని, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించాలి. వాటిలో స్థానిక కళలైన బుర్రకథ, ఒగ్గుకథ, హరికథ, పల్లె సుద్దులు, యక్షగానం, కోలాటం, బుడుబుక్కల కథ, చెక్క భజన, మొదలైనవి వాచకాల్లో ఉండాలి.
- వాచకాలు నిరంతర సమగ్ర మూల్యాంకానికి అనువుగా ఉండాలి.

**భాషాభ్యసనం - అదనపు సామగ్రి :**

నిర్దేశిత పాఠ్యపుస్తకాలతో బాటు పిల్లల భాషాపాటవాన్ని అభివృద్ధి పరచడానికి అదనపు సామగ్రి కూడా అందుబాటులో ఉండాలి. ఈ అదనపు సామాగ్రి దిగువ విధంగా ఉండవచ్చు.

- **నిఘంటువులు :**
    - భాషాభివృద్ధికి నిఘంటువులు ఉత్తమ సాధనాలు అందువల్ల ఇవి పిల్లలకు అందుబాటులో ఉండాలి.
    - ప్రాథమిక దశలో పిల్లలకు సచిత్ర నిఘంటువులు, లఘు నిఘంటువులతో పరిచయం కల్గాలి.
    - నిఘంటువుల సాయంతో పిల్లలు పదాలకు అర్థాలను, వాక్యరూపాలను గ్రహించి పదజాలాన్ని ఉపయోగించే సామర్థ్యం పొందాలి.
- **పరామర్శ గ్రంథాలు :**
    - ప్రాథమిక దశలో విద్యార్థి కల్పతరువు, పూర్వగాథాలహరి, పెద్దబాలశిక్షతో బాటు సచిత్ర విజ్ఞాన సర్వస్వాలు పిల్లలకు అందుబాటులో ఉండాలి. తద్వారా వారిలో సాహిత్యాభిరుచి పెంపొందుతుంది.
    - పరామర్శ గ్రంథాలు పిల్లల్లో సౌందర్యాత్మక దృష్టిని పెంపొందిస్తాయి. భాషా సౌందర్యాన్ని ఆవిష్కరిస్తాయి.
    - పరామర్శ గ్రంథాల పఠనం, సాహిత్య పఠనంలో ఆసక్తిని పెంపొందిస్తుంది.
- **అభ్యాస పుస్తకాలు (Work Books) :**
    - విద్యార్థులు స్వయంగా అభ్యసనం చేయడానికి, స్వీయ మూల్యాంకనానికి, స్వీయ వ్యక్తీకరణకు అభ్యాస పుస్తకాలు తోడ్పడుతాయి.
    - అభ్యాస పుస్తకాలు, అదనపు సామగ్రి ఆసక్తికరంగానూ, నూతనంగానూ, సవాళ్లు విసిరేవిగానూ ఉండాలి. కేవలం పునరుక్తి అభ్యాసాల రూపంలో గాని, పాఠ్యపుస్తకాల్లోని అభ్యాసాల రూపంలో గాని ఉండరాదు.
- **బాల సాహిత్యం :**
    - పిల్లలందరికీ బాల సాహిత్యం అందుబాటులో ఉండాలి. దీనిలో కథా పుస్తకాలు, జీవిత చరిత్రలు,ఆత్మకథలు, బాలగేయాలు మున్నగునవి ఉండవచ్చు.



SCERT TELANGANA

- **గోడ పత్రికలు :**

  - పిల్లల సృజనాత్మక శక్తులను ప్రదర్శించడానికి గోడ పత్రికలు తోడ్పడుతాయి. పిల్లలు వేసిన కార్టూన్లు, ప్రాసగేయాలు, పద్యాలు, పొడుపుకథలు, చిత్రాలు, సేకరించిన అంశాలు, సమాచారం ఈ గోడ పత్రికలపై ప్రదర్శించవచ్చు.

- **బహుళ వాచకాలు (పాఠ్య పుస్తకాలు) :**

  - పిల్లల ఉపయోగం కోసం బహుళ పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తేవాలని NCF 2005 పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు పాఠ్యపుస్తకాలను స్వయంగా ఎంపిక చేసుకోవడానికి అనుమతించాలి.

- **అదనపు సామాగ్రి :**

  - పిల్లల్లో భాషా పాటవాన్ని పెంపొందించడానికి పలు ప్రత్యామ్నాయ సామగ్రిని అర్థవంతంగా, సందర్భోచితంగా ఉపయోగించుకోవాలి. వాటిలో చార్టులు, ప్లె కార్డులు, చిత్రాలు, పోస్టర్లు, ఫోటోగ్రాఫులు, Leaf plates, ఆల్బమ్‌లు, రేడియో, టేపు రికార్డులు, టెలివిజన్, వీడియో, ఫిల్ములు, తోలు బొమ్మలు మున్నగునవి గ్రంథాలయంలో అందుబాటులో ఉండాలి.

* * *

SCERT TELANGANA

# 5. మూల్యాంకన పద్ధతులు (Assessment proceedings)

## పరిచయం

బోధనాభ్యసన ప్రక్రియలో పరిగణనం (మూల్యాంకనం) ఒక భాగం. విద్యార్థుల అభ్యసనాన్ని వేగవంతం చేయగల ప్రక్రియల్లో ఇది ఒకటి. ఐతే ఇది కేవలం పరీక్షలు అను భావనకే పరిమితమవుతోంది. తద్వారా విద్యార్థుల్లో అవాంఛనీయమైన ఉద్విగ్నతలకు కారణమవుతోంది. ఈ పరిగణనం సులభంగా ఉండాలని విద్యార్థుల్లో భయాన్ని, ఉద్విగ్నతలను తొలగించాలని 2005 నాటి NCF చెప్తోంది. RTE 2009లోని సెక్షన్ 29 (2) కూడా విద్యా సాధికార సంస్థలు (Academic Authority) విద్యా ప్రణాళికలను సిద్ధం చేసేటప్పుడే మూల్యాంకన కార్యక్రమాలను కూడా సమగ్రంగా, నిరంతరంగా నిర్వహించాలని సూచించింది. అట్లే ఈ విషయాల్లో సంపూర్ణమైన అవగాహనను ఉపాధ్యాయులు కల్గి ఉండాలి. ఆ భావనలను అమలు చేయాలి.

## అర్థవంతమైన మూల్యాంకనం (పరిగణనం)

ప్రస్తుత పరిగణన వ్యూహాలు సులభమూ, అర్థవంతమూ చేయడానికి కింది అంశాలను దృష్టియందుంచుకోవాలి.

- ప్రస్తుత పరీక్షా వ్యవస్థ ఎందుకు పిల్లలలో ఏ విధమైన ఒత్తిడిని, భయాన్ని ఉద్విగ్నతలను పెంపొందిస్తోంది?
- పిల్లల అభ్యసన ఫలితాలను అంచనా వేయడానికి కేవలం పరీక్షలపైనే ఆధారపడవల్సిందేనా?
- ప్రస్తుత పరీక్షలు పిల్లల భాషా పాటవాన్ని మదింపు వేయడానికి వాస్తవంగా తోడ్పడుతాయా?
- పరీక్షల్లో అడిగే ప్రశ్నలు వాస్తవంగా పిల్లల సృజనాత్మకతను, ఊహాకల్పనశక్తిని అంచనా వేయడానికి ఉపకరిస్తున్నాయా?
- నిరంతర, సమగ్రమైన మూల్యాంకనాన్ని గూర్చి మనమేమనుకుంటున్నాం?

పై ప్రశ్నలను క్షుణ్ణంగా విశ్లేషిస్తే మనకు కింది విషయాలు తెలిసివస్తాయి.

- పరీక్షల్లో అడిగే ప్రశ్నలు కేవలం కంఠతా పట్టడాన్నే పరీక్షిస్తున్నాయి.
- భాష విషయకంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రస్తుత పరీక్షా విధానం కేవలం పాఠ్యాంశ విషయాన్ని, కంఠతాపట్టిన వ్యాకరణ నియమాలను మాత్రమే మదింపు చేస్తుంది. పిల్లల కల్పనాశక్తిని, సృజనాత్మకతను దృష్టియందుంచుకొనుటలేదు.



SCERT TELANGANA

- పరిగణనం కేవలం రాత మూలకంగానే జరుగుతుంది. భాషా నైపుణ్యాలు, శ్రవణ మూలక అవగాహనం పూర్తిగా విస్మరించబడుతున్నాయి. పరీక్షల్లోని ప్రశ్నాంశాలు కూడా పరిమిత ప్రతిభా పాటవాలను పరీక్షించే ఖాళీలు పూర్తిచేయడం, జతపరచడం వంటి రూపాలకు పరిమిత మవుతున్నాయి.

> *అభ్యాసకుని అభ్యాస ప్రగతిని తెలుసుకోవడానికి పరిగణనం ఉపకరించాలి. ఈ సమాచారం పరిపుష్టిగా పనిచేసి అభ్యసనానికి, ఉపాధ్యాయునికి ప్రయోజనం చేకూర్చాలి. సకాలంలో తగిన చర్యలు తీసుకోవలసినదిగా ఉండాలి. అందువల్ల ఈ పరిగణనం సమగ్రం కావాలి. నిరంతరం కొనసాగాలి*
>
> ***NCF 2005***

**మనం ఏం చేయాలి?**

- సమగ్ర నిరంతర మూల్యాంకన విధానాలపై ఉపాధ్యాయులకు ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహించాలి.
- పరీక్షలు, నిర్దేశ్యాలకు తోడుగా, తరగతి పని, సమ వయస్కుల జట్టు పనులు, సహపాఠ్య కార్యక్రమాలు మున్నగునవి వాటిలో పిల్లల భాగస్వామ్యాన్ని మదింపు చేయాలి. ఇందుకు పలు పరిగణన సాధనాలను ఉపయోగించాలి.
- కల్పనాశక్తి, సృజనాత్మక, ఉపలబ్ధి స్థాయి, విషయజ్ఞాన వినియోగం మున్నగునవన్నీ మదింపుకు కావాలి. కేవలం విషయ ప్రాతిపదిక, కంఠతా పట్టిన అంశాల ప్రాతిపదికపై ప్రశ్నాంశాలు అంటే ప్రశ్నలు, రిక్తపూరణాలు, జతపరచడం మున్నగు వాటిని తొలగించాలి.
- ఆలోచనలను, వ్యక్తీకరణ దక్షతను రేకెత్తించే ప్రశ్నాంశాలు పరిగణనలో చేర్చాలి. ఉదా :
    - నీవే ఒకవేళ ఉడుత స్థానంలో ఉంటే ఏం చేసేవాడివి?
    - ఉడత, ఏనుగును ఎదిరించాల్సి వస్తే ఏంచేసి ఉండేది?
    - కథను విస్తరించండి లేదా కథకు ముగింపు చెప్పండి
- **మూల్యాంకనంలో కింది సాధనాలను మనం ఉపయోగించుకోవచ్చు**
    - కృత్య సాక్ష్యాలు (portfolios)
    - వారసత్వ అభిలేఖలు (anccdots)
    - పలు భాషావినియోగ సందర్భాల్లో అదనపు పాఠ్యకార్యక్రమాల్లో పాల్గొనడం.
    - భాషా క్రీడలు



SCERT TELANGANA

- నివేదికల తయారీ మరియు సమర్పణ
- భాషాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడం
- ఉపలబ్ధి సమీక్ష మరియు పుస్తక సమీక్షలు మొ॥నవి.

- భాషా పరిగణనంలో ర్యాంకులు, మార్కులు ఇవ్వకుండా పిల్లలకు గ్రేడులు ఇవ్వడం, ఈ గ్రేడులు కూడా గుణాత్మకాలు కావడం తద్వారా పిల్లల భాషా పాటవ స్థాయిలను పెంపొందించడం.
- నిర్ణీత సమయాలలో నిర్వహించే పరీక్షలలా కాకుండా మూల్యాంకనం నిరంతరం జరగాలి. బోధనాభ్యసన ప్రక్రియలో అంతర్భాగం కావాలి.
- భాషా బోధన లక్ష్యాల ప్రాతిపదికపై భాషా ఉపలబ్ధి పరిగణనం జరగాలి. భాషాంశాలు, భాషా నైపుణ్యాలపై పిల్లలకు గల పట్టు, వ్యక్తీకరణ నైపుణ్యాలు, సాహిత్యంలో ఆసక్తి, సద్వ్యైఖరులు, సౌందర్యాత్మక అనుభూతి, సంస్కృతి మరియు సాంప్రదాయాలు, సృజనాత్మకతను ప్రశంసించగల, ప్రోత్సహించగల నైపుణ్యాలు పరిగణనం పరిధిలోకి రావాలి.
- పరిగణనం లక్ష్యాధారం కావడానికి పిల్లలు పాఠ్యపుస్తకాలతో బాటు పరామర్శ గ్రంథాలు, మూలగ్రంథాలు, నిఘంటువులు, విజ్ఞాన సర్వస్వాలు, వివిధ పత్రికలు, సంచికలు మున్నగునవి వాటిని సంప్రదించాలి. ఈ పుస్తకాలు పిల్లలకు అందుబాటులో ఉండాలి.
- పరిగణనం పిల్లల మానసిక, ఉద్వేగ, అభివృద్ధికి తోడ్పడాలి.
- బోధన మరియు మూల్యాంకన వ్యూహాలు/ పద్ధతులు/ కార్యక్రమాలు అన్నీ పిల్లల మూల్యాంకానికి సంబంధించిన ఎదుగుతున్న జ్ఞానాత్మక, సాంఘిక, సౌందర్యాత్మక, నైతిక పార్శ్వాలను దృష్టియందుంచుకోవాలి.

* * *



SCERT TELANGANA

# 6. ఉపాధ్యాయ శిక్షణ

**పరిచయం**

పిల్లల సర్వాంగీణ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది. ఇంతకు ముందటి అధ్యాయాల్లో తెలుసుకున్నట్లుగా పిల్లలు తమ వయస్సుకు సరిపడినంత భాషాజ్ఞానంతో (పదజాల జ్ఞానంతో), తమకుగల ఇతర విషయాల జ్ఞానంతో పాఠశాలకు వస్తారు. ఈ జ్ఞానాభివృద్ధికి పాఠశాలల్లో తగిన అవకాశాలు విస్తృతంగా వారికి లభించాలి. అందువల్ల భాషాజ్ఞానాభివృద్ధి సాధ్యమవుతుంది. అందుకు ఉపాధ్యాయులు పిల్లల భాషా అభ్యసనం, జ్ఞాననిర్మాణ శక్తియుక్తులను అర్థంచేసుకుని, వారు ఆ శక్తియుక్తులను ఎలా సొంతం చేసుకోన్నారో ఆరాతీయాలి. అట్లే పాఠ్యాంశాలను ఆమూలాగ్రం అర్థంచేసుకుని, అన్ని విధాలుగా పిల్లల భాషాభివృద్ధికి తగిన పునాదులు నిర్మించాలి. భాషాభ్యసనలో పిల్లలకు ఎదురయ్యే సవాళ్ళను సమర్థవంతముగా ఎదుర్కొనుటకు అవసరమైన వ్యూహాల రచన చేసుకోవాలి. విషయ ప్రణాళికలోని విషయాలనేగాక కాలక్రమంలో పిల్లలు సాధికారత గల అభ్యాసకులుగా మారడానికి తగిన సహాయ సహకారాలు ఉపాధ్యాయుల నుండి అందాలి. ఇందుకు ఉపాధ్యాయులు బాధ్యత వహించి పిల్లలకు అవసరమైన అభ్యసన సన్నివేశాలను కల్పించాలి. పిల్లలు ఏదో ఒక విషయంతోనే ఆగిపోకుండా చూడాలి.

ఈ చర్యలన్నీ ఉపాధ్యాయులు వృత్తిపూర్వ, వృత్యంతర శిక్షణను పొందినపుడు మాత్రమే సాధ్యమవుతాయి. అట్లే ఈ శిక్షణలు నిరంతరం జరగాలి. అందుకు వీటికోసం కార్యాచరణ పథకాలను సిద్ధంచేసుకోవాలి. ఈ శిక్షణలు ఆనవాయితీకారాదు. తాత్కలిక ప్రయోజనాల కోసం కారాదు. ఈ శిక్షణలు బాలల మనో విజ్ఞానం వారి అభ్యసన విధానం, వారి భావ నిర్మాణ శక్తి, భాషా నిర్మాణం, గణితం, విజ్ఞానశాస్త్రాల అభ్యసనం మున్నగు అంశాలపై ఉపాధ్యాయులకు లోతైన అవగాహనను పెంపొందించాలి. పరిశోధకులు అందిస్తున్న నూతన బోధనాభ్యసన వ్యూహాలను ఈ శిక్షణలో ఉపాధ్యాయులకు పరిచయంచేయాలి. పాఠశాల విద్యార్థుల్లో గల లింగసంబంధ, వైకల్య సంబంధ, వెనుకబడిన, అణగారిన వర్గాల సంబంధ సమస్యలపై సదవాగాహన, సానుకూల దృక్పథం ఉపాధ్యాయుల్లో పెంపొందించాలి. విద్యాక్షేత్రంలో సాంకేతిక విజ్ఞాన ఫలితాలను నిరంతరం ఉపయోగించుకోగల సామర్థ్యం ఉపాధ్యాయులకు లభించాలి.

అందరు పిల్లల్లో సహజంగా సుసంపన్నమైన అభ్యసన శక్తి యుక్తులున్నాయని, వాటిని పిల్లలు అత్యంత సమర్థంగా ఉపయోగించి భాషలను అభ్యసిస్తారన్న భావనలను ఉపాధ్యాయుల్లో ఈ శిక్షణ ద్వారా పెంపొందించాలి. సామాన్యమైన పిల్లలు కూడా ఎంతో సుసంపన్నమూ, సంక్లిష్టమైన భావాల వ్యక్తీకరణకు భాషను ఉపయోగించుకో గల శక్తి సామార్థ్యాలున్న వారని ఉపాధ్యాయులు గుర్తించేట్లు చేయాలి. పిల్లలు ఏ సమస్యలనైనా సునాయసంగా పరిష్కరించుకోగలరని ఇందుకు వారికి అవసరమైనది ఉపాధ్యాయుని నుండి ప్రోత్సాహం మరియు వారి శక్తియుక్తులను మేల్కొల్పడమేనని తెలియజెప్పాలి. ఇక పాఠశాల విద్యాప్రణాళికలో భాష రెండు పాత్రలను పోషిస్తుంది. ఒకటి భాషగా, మరొకటి మాధ్యమంగా, భాషాపాధ్యాయుడు భాష యొక్క ఈ రెండు పాత్రలను దృష్టిలో ఉంచుకొని భాషాబోధనను చేపట్టాలి. ప్రతి తరగతి ఒక భాషాభ్యాసన తరగతి అను భావనను, అభిప్రాయాన్ని ఉపాధ్యాయులందరిలో పాదుకొల్పాలి.



SCERT TELANGANA

**జాతీయ విద్యా ప్రణాళికాచట్రం - 2005 మరియు బాలల హక్కుల చట్టం - 2009:**

2005 నాటి జాతీయ విద్యాప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయులు కేవలం ఉపాధ్యాయులు కారు. వారు విద్యార్థులకు జ్ఞాన నిర్మాణంలో సహకరించేవారు. ఇటీవలి బాలలహక్కుల చట్టం 2009 కూడా విద్యాక్షేత్రంలో ఉపాధ్యాయుల ప్రాధాన్యతను వారి విధులు, బాధ్యతలు నొక్కి చెప్పింది. ఈ దృష్టిలో ఉపాధ్యాయులు తమ పని విధానాన్ని, పని సంస్కృతి మార్చుకోవాల్సిన అవసరం ఉంది.

NCF 2005 మరియు RTE 2009 రెండున్నూ ప్రభావిశీలియైన బోధనాభ్యసన ప్రక్రియకు సమర్ధులైన ఉపాధ్యాయల తయారీకి అధిక ప్రాధాన్యతనిచ్చాయి. ఈ శిక్షణ ఏదో ఒక పర్యాయం కాక నిర్ణీత కాల వ్యవధుల్లో నిరంతరం కొనసాగాలి.

అన్నిస్థాయిల్లోని విద్యార్థులకు విద్యనందించే బాధ్యతల నిర్వహణలో ఉపాధ్యాయులు చేయాల్సినదేమి, చేయాకూడనిదేమి అన్న విషయాలను RTE 2009 స్పష్టంగా వక్కాణించింది. ఈ చట్టంలోని కొన్ని సెక్షన్లు దిగువ విధంగా ఉన్నాయి.

- సెక్షన్ 16 (RTE 2009 : 6) ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేంతవరకు పాఠశాలలో చేరిన ఏ విద్యార్థిని కూడా ఒకే తరగతిలోని నిలిపివేయడంగాని, పాఠశాలనుండి వెలివేయరాదు.
- సెక్షన్ 171 (RTE 2009 : 6) ఏ విద్యార్థిని శారీకంగా, మానసికంగా దండించకూడదు.
- సెక్షన్ 241 - B(RTE 2009 : 8)

29వ సెక్షన్ (2) (RTE 2009 : 9)లో సూచించిన విధంగా ఉపాధ్యాయులు విద్యాప్రణాళికను పూర్తి చేయాలి. అట్లే విద్యావిషయక ప్రాధికార సంస్థ సిద్ధంచేసిన విద్యాప్రణాళికా మూల్యాంకన కార్యక్రమాలు కింది నియమాలను పాటించాలి

అ: రాజ్యాంగంలో పొందుపరచిన విలువలకు అనుగుణంగా ఉండాలి.

ఆ: విద్యార్థి సర్వాంగీణ వికాసానికి వీలుగా ఉండాలి.

ఇ: పిల్లల జ్ఞానాన్ని, శక్తియుక్తులు, ప్రతిభను నిర్మించాలి - పెంపొందించాలి.

ఈ: శారీరక, మానసిక శక్తులను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలి.

ఉ: కృత్యాలు, పరిశోధన, అన్వేషణల ఆధారంగా విద్యార్థి సేచ్ఛకు ప్రాధాన్యత ఇచ్చే శిశు కేంద్రీకృత పద్ధతిలో అభ్యసనం జరగాలి.

ఊ: వీలైనంత వరకు పిల్లల మాతృభాష మాధ్యమం ద్వారానే విద్యాబోధన జరగాలి.

ఋ: భయం లేకుండా, ఉద్వేగం, trauma ల నుండి దూరంగా విద్యార్థి సేచ్ఛగా తన అభిప్రాయాలను వ్యక్తీకరించగల వాతావరణాన్ని కల్పించాలి.

ఋ:  సమగ్రమూ, నిరంతరమూ అయిన మూల్యాంకనం సాయంతో పిల్లల జ్ఞానం, అవగాహనం, శక్తియుక్తుల వినియోగాన్ని అంచనావేయాలి.

- సెక్షన్ 24 - E (RTE 2009 : 8)

ఉపాధ్యాయులు క్రమబద్ధంగా నిర్నీత వ్యవధిలో తల్లిదుండ్రులు, విద్యార్థి పోషకులతో సమావేశాలు ఏర్పాటుచేసి వారి పిల్లల పాఠశాల హాజరు స్థితి, అభ్యసన శక్తియుక్తులు, సాధించిన ప్రగతి, పిల్లల అభివృద్ధికి సంబంధించిన ఇతర విషయాలను నివేదించాలి.

- సెక్షన్ 7(6) (RTE 2009 : 4)

కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో

అ:  సెక్షన్  29లో సూచించిన విధంగా జాతీయ విద్యా ప్రణాళిక చట్రాన్ని విద్యాసాధికార సంస్థ సాయంతో అభివృద్ధి పరచాలి

ఆ:  ఉపాధ్యాయుల శిక్షణకు ప్రమాణాలను రూపొందించి అమలుకు ఆజ్ఞలు జారీ చేయాలి.

ఇ:  పరిశోధనల నిర్వహణకు, అన్వేషణలకు, ప్రణాళికా రచనకు, మానవ వనరుల అభివృద్ధికి రాష్ట్రాలకు వనరుల సాయం, సాంకేతిక సహాయం చేయాలి.

- సెక్షన్ 8 J (RTE-2009:4)

ప్రభుత్వాలు ఉపాధ్యాయులకు తగిన శిక్షణనందించాలి.

- సెక్షన్ 9 J (RTE-2009:5)

స్థానిక సంస్థలు కూడా తమ ఉపధ్యాయులకు తగిన శిక్షణ సౌకర్యాలు కల్పించాలి.

**ముగింపు**

పై అంశాల దృష్ట్యా వృత్తిపరమైన అత్యుత్తమ శిక్షణ పొందిన వ్యక్తులనే ఉపాధ్యాయులుగా నియమించాలి. మరియు వారికి నిరంతర శిక్షణ ఇవ్వాలి. ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాలకు అన్ని స్థాయిల్లో, అన్ని హంగులూ కల్పించి పటిష్టంగా అమలు చేయాలి. ఈ కార్యక్రమాలను పటిష్టంగా రూపొందించకపోతే RTE నిబంధనలకు లోబడి విధులు, బాధ్యతలను మనం అమలు చేయలేం.

- ఉపాధ్యాయులు, పిల్లల అనుభవాలపై ఆధారపడిన కృత్యాలతో విద్యా ప్రణాళికను సుసంపన్నం చేయాలి. యశ్‌పాల్ సిఫార్సుల ప్రకారం ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు కావాలి. వారు తమదైన బోధన అభ్యసన ప్రక్రియను అభివృద్ధి పరుచుకోవాలి.

SCERT TELANGANA

- పాఠశాల సమాజంలోని భాషమని ఉపాధ్యాయులు గుర్తించాలి. వివిధ విద్యా ప్రాతినిధ్య సంస్థల (Agencies of education)ను ఒక తాటిపైకి తీసుకొని రాగల నైపుణ్యాలను ఉపాధ్యాయులు సంపాదించాలి.
- ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం ప్రత్యేక గ్రంథాలయం ఉండాలి.
- ఉపాధ్యాయ శిక్షణ (Sustained capacity) వృత్తిపరమైన సామర్థ్యాల నిర్మాణానికి అనుగుణంగా ఉండాలి.
- శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు విద్యా ప్రణాళిక, విషయ ప్రణాళిక, పాఠ్యపుస్తకాలను విమర్శనాత్మకంగా సమీక్షించుటకు అవకాశాలు కల్పించాలి. వారు వీటిని నిర్మాణ ప్రక్రియ భాగస్వాములని గుర్తించాలి.
- ఉపాధ్యాయ శిక్షణ ఉపాధ్యాయుల వృత్తిపర భాషా నైపుణ్యాలను పెంపొందించేదిగానే కాక విద్యార్థుల జ్ఞానరాశిని కూడా పెంపొందించేదిగా ఉండాలి.
- ఉపాధ్యాయులు భాషాస్వభావం, భాషాంశాలు, భాషాప్రాధాన్యతలను గుర్తించునట్లు శిక్షణ ఇవ్వాలి. ఉపాధ్యాయులకు గల భాషా పటిమ విద్యార్థుల ప్రతిభా వ్యుత్పత్తులను విస్తరిస్తుంది.
- భాషాబోధన సాహిత్య బోధన కాదు అందువల్ల భాషాబోధనలో భాషోపాధ్యాయులు భాషారూపానికి, నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పాఠంలోని విషయానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి.
- బోధన వ్యూహంగాను, బోధన గమ్యం (goal) గాను బహుభాషీయతను ఉపాధ్యాయులు ప్రశంసించగల్గాలి.
- భాషామూల్యాంకన సూచనలను కూలంకషంగా అవగాహన చేసుకొని ఉపాధ్యాయుల దానిని నిరంతరమూ, సమగ్రం చేయాలి.
- అత్యుత్తమ, సమర్థమైన బోధన కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలి.
- పాఠశాల సముదాయాలు, మండల వనరుల కేంద్రాలు, జిల్లా విద్యా శిక్షణ సంస్థలు, ఉపాధ్యాయ విద్యా కళాశాలలు, సమగ్ర విద్యా అధ్యయన సంస్థలతో బాటు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థను బలోపేతం చేయాలి. తద్వారా వృత్యంతర ఉపాధ్యాయ శిక్షణ ఆయా స్థాయిల్లో నిర్వహించుటకు కార్యాచరణ సిద్ధం చేయాలి.
- శిక్షణా కేంద్రాల్లో ఒక మంచి గ్రంథాలయం ఉండాలి. అధిక సంఖ్యలో పరామర్శ గ్రంథాలు, మూల గ్రంథాలు, నిఘంటువులు, విజ్ఞాన సర్వస్వాలు, పాఠ్యపుస్తకాలు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు నిరంతరం అందుబాటులో ఉండాలి.

SCERT TELANGANA

- భాషా బోధన నిపుణుల సముదాయాలు తమ అనుభవాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయలోకానికి తెలియజెప్పాలి.
- శిక్షణా కార్యక్రమాల (Monitoring) నిర్వహణను పరిశీలించుటకు, సమీక్షించుటకు ఒక ప్రత్యేక సంస్థ (agency) ను ఏర్పాటుచేయాలి.
- నిర్ణీత వ్యవధుల్లో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణను తప్పనిసరి చేయాలి. ఈ శిక్షణా కార్యక్రమాలను సెలవుల్లో, సంవత్సరాంత సెలవుల్లో ఏర్పాటు చేయాలి. అవసరమైతే ప్రాధ్యాయులకు ఇందుకు ఆర్జిత సెలవులు, గౌరవభృతిని ఇవ్వాలి. ఎట్టి పరిస్థితుల్లో కూడా పాఠశాల పని రోజుల్లో శిక్షణ కోసం, కార్యశిబిరాల కోసం, టెలికాన్ఫరెన్సుల కోసం ఉపాధ్యాయులను ఆహ్వానించరాదు.

* * *

SCERT TELANGANA

# 7. సిఫార్సులు

1. ఇంటిలో, పరిసరాల్లోని వారు ఉపయోగించే భాషల సాయంతోనే పిల్లలు తమ చుట్టూరా ఉన్న ప్రపంచానికి సంబంధించిన జ్ఞానాన్ని, సంస్కృతిని, గణితాన్ని, పర్యావరణాన్ని గురించిన జ్ఞానాన్ని, సంపాదిస్తారు. అందువల్ల ఈ భాషలను గౌరవించాల్సి ఉంటుంది. వీలైనంత వరకు ఆ భాషా మాధ్యమాల ద్వారా పిల్లలకు విద్యా బోధన జరగాల్సి ఉంటుంది. ఈ శిశువుల భాషోపయోగాన్ని విద్య ద్వారా ప్రోత్సహించాలి. ముందటి అధ్యాయాల్లో ప్రస్తావించినట్లుగా పిల్లల భాషాభివృద్ధి బహుభాషా పరిసరాల్లోనే సాధ్యమవుతుంది. ఈ విషయం గిరిజనులు, అల్ప సంఖ్యాక వర్గాల వారి విషయంలోనూ, వెనుకబడిన వర్గాల వారి విషయంలోనూ వాస్తవమని చెప్పవచ్చు.

2. అన్ని భాషల బోధనకు, ఇంగ్లీషుతో బాటు అత్యున్నత ప్రతిభావంతమైన శిక్షణ పొందిన ఉ పాధ్యాయులు అవసరమౌతారు. తెలుగు మాధ్యమంలో విద్యనభ్యసించిన పిల్లలు కూడా ఆంగ్ల మాధ్యమం పాఠశాలల్లో చేరి తమ చదువులు కొనసాగించుకొనుటకు, వీలు కల్గించాలి. ఇలా బోధనామాధ్యమాన్ని మార్చుకొనడానికి అనుమతినీయాలి. ఈ బోధన మాధ్యమ మార్పుకు అవసరమైన సామగ్రి, వనరులు, శిక్షణ ప్రభుత్వం పిల్లలకు కల్పించాలి.

3. ద్విభాషీయతకు, (పాఠశాల ఉపలబ్ధి) విద్యాఉపలబ్ధికు దగ్గరి సంబంధమున్న కారణాన పాఠశాల విద్యా కాలంలో ద్విభాషీయతను పెంచిపోషించడానికి తగిన కృషి చేయాలి. భాషా విషయకంగా ఉన్నత ప్రమాణాలను సాధించలేకపోతే గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రాల్లో ఆశించిన విద్యా ప్రమాణాలను పెంపొందించలేము.

4. ప్రాథమిక దశలో భాషా బోధనకు కేటాయించే సమయం భాషాభ్యసనంలో అతి కీలకమైనది. అట్లే పాఠశాల విద్యా కాలంలోని మొదటి, రెండు మూడు సంవత్సరాల్లో బహుభాషల అభివృద్ధి కృత్యాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

5. విద్యా ప్రణాళికా కర్తలు, పాఠ్యపుస్తక రచయిత, ఉపాధ్యాయ శిక్షకులు, ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న ఛాత్రులు వివిధ బోధనాంశాలు (Subject) మధ్య సత్సంబంధాలు, సన్నిహిత సంబంధాలను స్థాపించి ఉన్నత ప్రమాణాలు గల భాషా సంపాదనకు కృషి చేయాలి.

6. ఉన్నత ప్రమాణాలు గల భాషా సామర్థ్యాలు సులభంగా, సునాయాసంగానే ఒక భాష నుండి మరో భాషకు సంక్రమిస్తాయి. అందువల్ల విద్యా ప్రణాళికలోని అన్ని భాషలపై ప్రత్యేక దృష్టికనబరచాలి.



SCERT TELANGANA

7. భారతదేశంలోని పలు భాషలతో బాటు తెలుగును కూడా సుసంపన్నం చేసిన భాష సంస్కృతం. ఇది భారతీయ సాంస్కృతిక వారసత్వానికి సంబంధించినది. ఆరో తరగతి నుండి ఈ భాషను ఒక ఐచ్ఛిక అధ్యయనంగానే ప్రవేశపెట్టవచ్చు.

8. విద్యార్థులు మాతృభాష, హిందీ, ఆంగ్ల భాషల్లో ఆశించిన ప్రమాణాలను సంపాదించడానికి అనువుగా బోధనా పద్ధతులు, బోధనా సామగ్రి, బోధనాభ్యసన ప్రక్రియలు, వ్యూహాలు, మూల్యాంకన కార్యక్రమాలను రూపొందించుకోవాలి. దీన్ని నివారించాలి.

9. తరగతిలో పలు భాషలు మాట్లాడే వారున్నారన్న స్పృహ ఉపాధ్యాయులకుండాలి. ఈ ఆయా భాషా వ్యవహర్తలైన పిల్లలను ఉత్తమ వనరులుగా గుర్తించాలి. గిరిజన ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల భాషలతో పరిచయం ఉన్న ఉపాధ్యాయులను  నియమించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

10. ఆసక్తికరమూ, ఆలోచనాత్మకమూ, సవాళ్లను విసర గల పాఠ్యపుస్తకాలను, ఇతర వాచకాలను సిద్ధం చేయాలి. ఇవి పలు వైవిధ్యపూరితమైన భావనలతో, ప్రక్రియలతో నిండి ఉండాలి. వీటిని నిపుణులైన, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో రాయించాలి. తద్వారా భాషా బోధనలో ఉన్నత ప్రమాణాల స్థాపనకు కృషి చేయాలి.

11. వైవిధ్య భరితమైన సన్నివేశాలు, సందర్భాలలో వినియోగించిన భాషా రూపం గల పాఠ్యాంశాలు బోధనకు ప్రాతిపదికలు కావాలి.

12. భాషా బోధనలో అత్యుత్తమ ప్రమాణాలతో శిక్షణ ఇవ్వగల ఉపాధ్యాయ విద్యా కళాశాలలు, అధ్యాపకులు అవసరమవుతారు. భాషా బోధనలో ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆశించిన ప్రమాణాలను సాధించడాన్ని దృష్టియందుంచుకోవాలి.

13. రాష్ట్రంలోనూ, అంతరాష్ట్రీయం గాను, రాజకీయంగా భాషా విద్యను వికేంద్రికరించడానికి తక్షణ ప్రయత్నాలు ప్రారంభించాలి.

14. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బహుభాషా తరగతి గదులు విరివిగా కనబడతాయి. వీటిని విద్యా బోధనకు ఆటంకాలుగా కాక వనరులుగా గుర్తించాలి. ఈ బహుభాషాసంస్కృతి తరగతిగదులను సృజనాత్మకంగా ఉపయోగించుకొని భాషా, సంస్కృతుల వైవిధ్యతల ఎడ సానుకూల స్పృహను, సహనాన్ని పెంపొందించాలి.

15. అల్ప సంఖ్యాక వర్గాలు, గిరిజనులకు చెందిన భాషలు, ప్రమాదంలో పడుతున్న భాషలను రక్షించాలి. వాటిని అభివృద్ధి పరచాలి. నిత్యం పరిణమిస్తున్న సమాజం, ప్రపంచీకరణ ప్రభావాల నుండి సవాళ్లను ఎదుర్కొంటున్న ఆయా భాషలను కాపాడాలి.

SCERT TELANGANA

16. సాంస్కృతిక, మతపరమైన, సామాజిక పక్షపాతాన్ని సమాజం నుండి దూరం చేయాలి. ఇవి విద్యా ప్రణాళికకు భారం కాకుండా చూడాలి. భాషా తరగతులు అర్థవంతమైన, ఆహ్లాదకరమైన సామాజిక పరిసరాలుగా అత్యుత్తమంగా తగి ఉంటాయి. అందువల్ల అభ్యసన సామగ్రిని అభివృద్ధి పరచే వారు సృజనాత్మక వ్యక్తీకరణకు అవసరమైన సన్నివేశాలను సృజించాలి.

17. మన జ్ఞాన సంపదలో లింగ వివక్షతకు కొంత స్థానముంది. ఈ వివక్ష భాషా బోధనలో మరింత బలపడుతోంది.

18. పరిగణన (మూల్యాంకన) కార్యక్రమాలు కేవలం నిర్ణీత కాల వ్యవధులకు, వ్యాకరణాంశాలు, స్థానిక పఠనావగాహనలకు పరిమితం కారాదు. ఈ కార్యక్రమాలు సమగ్రం కావాలి. నిరంతరం నిర్వహింపబడాలి. వీటిలో భాషా వైవిధ్యతలు, వ్యక్తీకరణ కృత్యాలు భాగం కావాలి. ఇందుకు వివిధ పద్ధతులను అనుసరించాలి ఈ పద్ధతుల్లో చర్చలు, సంభాషణలు, కథలు అల్లడం, కృత్యసాక్ష్యాలు (portfolios), వారసత్వ అభిలేఖలు (ance dots) మున్నగునవి చేర్చాలి.

19. వివిధ వైకల్యాలు గల పిల్లలందరికీ ఒకే ప్రాంగణంలో విద్యాభ్యాస అవకాశాలు కల్పించాలి. అన్ని పాఠశాలలు ఈ వైకల్యాలు గల పిల్లలకు అందుబాటులో ఉండాలి. అవసరమైన మరుగుదొడ్లు, రాంపులు, నేలపై జారిపడని నాపరాళ్ళు మున్నగునవి పాఠశాలలో ఉండాలి. ఈ పిల్లలందరూ బోధనాభ్యసన కృత్యాల్లో నిమగ్నం అయ్యేట్లు చూడాలి. పాఠశాల సంస్కృతి జీవనంలో వారు ఒదిగిపోవాలి. మానసిక వికలాంగులకు ప్రత్యేక సహాయం పాఠశాలల్లో లభించాలి. ఐతే దృష్టిదోషం కలవారికి, తీవ్ర శారీరక వైకల్యం కలవారికి సాంకేతిక పరిజ్ఞానం అందించే పరిసరాలను సమకూర్చాలి. వారు సామాన్య విద్యార్థులవలె సౌకర్యవంతంగా విద్యాభ్యాసం చేయునట్లు చూడాలి.

20. భాషాభివృద్ధికి రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ జాతీయ విద్యాపరిశోధన శిక్షణ సంస్థతో భారతీయ భాషల సంస్థ (Institute of Indian languages) మైసూరు వారితో అంతర్గత సంబంధాలను స్థాపించుకోవాలి. ఆసక్తికరమైన, పాఠ్యాంశ సంబంధమైన పలు దృశ్యశ్రవణ కార్యక్రమాలను రూపొందించాలి.

21. విద్యా ప్రణాళికల్లో భాషకు అత్యంత ప్రాధాన్యత, గుర్తింపు లభిస్తున్న నేటి కాలంలో అందరు ఉపాధ్యాయులు భాషలో ప్రత్యేక పునశ్చరణ తరగతులకు, శిక్షణకు హాజరుకావాలి. ఈ శిక్షణలో ఆయా భాషల స్వరూపం, భాషా విధులు, పిల్లల భాషాభివృద్ధి వ్యూహాలు మున్నగునవి చర్చించాలి. వృత్తిపరమైన భాషా నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రతి ఉపాధ్యాయుడు ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు, సమావేశాల్లో పాల్గొనాలి. ఈ కార్యక్రమాలను పాఠశాల సముదాయం స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఏర్పాటు చేయాలి.

SCERT TELANGANA

22. పఠన అలవాట్లను విద్యార్థుల్లో పెంపొందించడానికి ప్రతి పాఠశాలకు అన్ని హంగులతో కూడిన గ్రంథాలయాన్ని సమకూర్చాలి. వ్యక్తిగతంగా చదువుకోవడానికి, రాయడానికి పిల్లలందర్నీ ప్రోత్సహించాలి. పఠన దిన చర్యను పిల్లలు విధిగా రాయునట్లు చూడాలి. పాఠశాల గ్రంథాలయాలను బలోపేతం చేయడానికి బాల సాహిత్యాన్ని సరఫరా చేయాలి. ప్రతి పాఠశాలలో శ్రేణీకృత (Graded reading material) పఠన సామాగ్రి పిల్లలకు అందుబాటులో ఉండునట్లు చర్యలు తీసుకోవాలి.

23. విజ్ఞానశాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాల్లో ఉపయోగిస్తున్న భాషారూపానికి, భాషా వాచకాల్లోని భాషా రూపానికి మధ్యగల అంతరాన్ని తగ్గించాలి. అలాకాకపోతే భాషావగాహన లోపం లేదా సమస్యవల్ల కానీ శాస్త్రీయ భావనలు పిల్లలకు సులభంగా అర్థంకావు.

24. ప్రాథమిక దశలోనే పిల్లలకు అభ్యసనం ఎడ ఆసక్తిని,ఉత్సాహాన్ని పెంపొందించడానికి వాచకాల్లో కథలు, పాటలు, బాలగేయాలు, సంభాషణలు విరివిగా చేర్చాలి. ఇవి భాషాసాహిత్యాల్లోని వివిధ కాలాలకు, వివిధ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించాలి. ఇవి విద్యార్థులు వైవిధ్యభరితంగా ఆలోచించడానికి, మరియు సందర్భోచిత భాషను వినియోగించడానికి తోడ్పడాలి.

25. భాషా బోధనభ్యసన కృత్యాలు విద్యార్థులు తమ అనుభవాలను ఆలోచనలను, అనుభవాలను, దృక్పథాలను, ఆసక్తులను నిస్సంకోచంగా వ్యక్తీకరించుటకు ప్రోత్సహించేవిగా ఉండాలి.

26. కంఠతా పట్టే అభ్యసనాన్ని నిరుత్సాహపరచడానికి తరగతి గదుల్లో ఆలోచనలు రేకెత్తించగల కృత్యాలను నిర్వహించాలి. వక్తృత్వం, వ్యాసరచన, పద్యపఠనం, సాహిత్య ప్రహేళిక, పాఠశాల పత్రికకు రచన చేయుట మున్నగు వాటిలో పోటీలు ఏర్పాటు చేయాలి. ఇవి పాఠశాల దైనందిన కార్యకలాపాల్లో భాగం కావాలి.

27. పిల్లల ప్రగతిని, బోధనాభ్యసన ప్రక్రియలు, ఉపాధ్యాయుల బోధనను అంచనావేసే పోటీలు రూపొందించాలి. వాటిని ఉపయోగించాలి.

28. జిల్లా, రాష్ట్ర స్థాయిలో భాషాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేసి భాషోత్సవాలు వంటి పలు కార్యక్రమాలను నిర్వహించాలి.

29. భాషాభ్యసనం, భాషాబోధన వ్యూహాల్లో చిట్టి పరిశోధనలను ప్రోత్సహించడానికి తగు ప్రణాళికలను సిద్ధంచేయాలి.

* * *

SCERT TELANGANA

## Annexure I: Language Consultants and Committee Members

**Consultants**

Prof Rama Kant Agnihotri

Prof H K Dewan

Dr Abdul Rasheed

Dr Najma Rehmani

**Vidya Bhawan Society, Udaipur**

**Committee Members**

1. Dr. Ravva Srihari
   Rtd. Vice Chancellor, Dravidian University
   Kuppam, Chittor, Distt. A.P.
2. Dr. Poranki Dakshina Murthy
   Rtd. Deputy Director, Telugu Academy
   Hyderabad, A.P.
3. Dr. D. Chandrashekar Reddy
   Rtd. Principal, Andhra Saraswatha Parishad
   Pratchya Kalashala, Nallakunta, Hyderabad, A.P.
4. Dr. D. Samba Murthy
   Rtd. Principal Govt. College Teacher Education
   Warangal, A.P.
5. Prof. Sahadevudu, SCERT, A.P. Hyderabad
6. Suvarana Vinayak, H.M. GPS Manthani
   Dist. Karimnagar, A.P.
7. V. Chennaiah S.A. Telugu ZPHS Narsing
   Ranga Reddy Dist., A.P.
8. V. Sharath Babu, S.A. Telugu Govt High School, Amberpet
   Hyderabad, A.P.
9. G. Narayana, Telugu Lecturer, DIET Rayachoti,
   Y.S.R. Kadapa Dist., A.P.



SCERT TELANGANA

10. V. Swarnalatha, S.A, Pathapattiseema, Polavaram,
West Godavari, A.P.
11. K. Ramesh Rao, SA, Govt. High School, Sawaran. Karimnagar
12. K. Buddhoji Chowdary, Telugu lecturer,
IASE Hyderabad, A.P.
13. K.R.T.L. Jyotirmayi, Lecturer, SCERT, Hyderabad
14. Mr Kumar Anupam, VBS, Udaipur
15. Ms Aditi Majumdar, VBS, Udaipur
16. Mr Pushpraj Ranawat, VBS, Udaipur

## Development & Coordination

N. Sarojini Devi Lecturer, Language Coordinator, SCERT, Hyderabad, A.P.
Dr. N. Upender Reddy, Professor & Head, Curriculum & Textbook Dept., SCERT,
B. Seshu Kumari, Director, SCERT, A.P., Hyderabad

SCERT TELANGANA

**Annexure II**

## References:

Agnihotri, R.K. 1988. 'Errors as learning strategies'. *Indian Journal of Applied Linguistics* 14.1:1-14.

Agnihotri, R.K. 1992. 'India: multilingual perspective'. In Nigel, T. (ed.), *Democratically Speaking: International Perspective on Language Planning*. South Africa, Salt River: National Language Project.

Agnihotri, R.K. 1995. 'Teacher's pace in the clasroom'. *The Language Curriculum: Dynamics of Change* (Vol.1). Report of the International Seminar. Hyderabad: CIEFL.

Agnihotri, R.K., Khanna, A.L. 1994. (eds.), *Second Language Acquisition: Socio-cultural and Linguistic Aspects of English in India* (RAL1). New Delhi: Sage Publications.

Agnihotri, R.K., Khanna, A.L. 1995. (eds.), *English Language Teaching in India: Issues and Innovations* (RAL2). New Delhi: Sage Publications.

Agnihotri, R.K. and Khanna, A.L. 1997. "Social psychological perspective on second language learning: A critique". In Singh, R. (ed.), *Grammar, Language and Society*. New Delhi: Sage Publications.

Agnihotri, R.K., Khanna, A.L. and Sachdev, I. (eds.), 1998. *Social Psychological Perspectives in Second Language Learning* (RAL 4). New Delhi: Sage Publications.

Alderson, J.C. and Baretta, A. (eds.), 1992. *Evaluating Second Language Education* Cambridge: Cambridge University Press.

Alderson, J.C., Clapham, C. and Wall, D. 1995. *Language Test Construction and Evaluation*. Cambridge: Cambridge University Press.

Allwright, D. and Bailey, K.M. 1991. *Focus on the Language Classroom*. Cambridge: Cambridge University Press.

Allwright, R.L. 1981. What do we want teaching materials for? ELT 36.1:5-18.

Arora, G.L. 1995. *Child centered Education for Learning without Burden*. Gurgaon: Krishna Publishing Company.

Beaumont, M. 1996. *The Teaching of Reading Skills in Second/Foreign Language. Patras*: The Hellenic Open University.

Carroll, J.B. 1956 (ed.), *Language, Thought and Reality: Selected Writings of Benjamin Lee Whorf*. New York: John Wiley and Sons.

Chomsky, N. 1972. *Language and Mind*. New York: Harcourt Brace Jovanovich.

Chomsky, N. 1996. *Powers and Prospects: Reflections on Human Nature and the Social Order* Delhi: Madhyam Books.

Edwards, V. 1998. *The Power of Babel: Teaching and Learning in Multilingual Classroom* Stoke-on-Trent: Trentham Book.

Gardner, H. 1993. *Multiple Intelligences: The Theory in Practice*. New York: Basic Books.

Gupta, R.S. 1994. *Selecting reading materials: some key considerations.* In Agnihotri, R.K., Khanna, A.L. 1994. (eds.), *Second Language Acquisition*. New Delhi: Sage Publications.

IIIich, I. 1981. Preface to Pattanayak, 1981. *Multilingualism and Mother Tongue Education.* Oxford University Press.

Jesperson, O. 1922. *Language: Its Nature, Development and Origin*. New York: W.W. Norton.

Ministry of Education. ‘Education Commission “Kothari commission”. 1964-1966. *Education and National Development*. Ministry of Education, Government of India. 1966.

*Learning without Burden*. Report of the National Advisory Committee. Education Act. Ministry of HRD, Department of Education, October, 2004.

*National Policy on Education*. 1986. Ministry of HRD, Department of Education, New Delhi.

*National Curriculum Frame Work*. 2009. NCERT, New Delhi.

Robert, J. 1995. ‘Self-directed classroom inquiry by teachers: known benefits, an assessment of criticisms, and implications for teacher-researcher activity’. *The Language Curriculum*: *Dynamics of Change* (Vol.1). Report of the International Seminar. CIEFL.

*Right to Education Act*. 2009.

*Teaching of Indian Languages. Position Paper.* National Council of Educational Research and Training, New Delhi.

*Teaching of English. Position Paper.* National Council of Educational Research and Training, New Delhi.

Zamel, V. 1985. *Responding to student writing*. TESOL Quarterly 19.1.

Must visit website:

http://www.languageinindia.com.

**Some Journals**

*Seminar* (Issue no. 493 of 2000 contains contributions by Krishna Kumar, Padma M. Sarangapani, Rohit Dhankar, Mohammad Talib, Sadhna Saxena, A.R. Vasavi, Shobha Sinha, Aruna Rathnam, Geetha B. Nambissan, and a short select bibliography on Redesigning Curricula), New Delhi, India.

*Sandarbh*, *Eklavya* (Hindi), Hoshangabad, India.

*Vimarsh, Digantar* (Hindi) Jaipur, India.

*Srote, Eklavya* (Hindi), Bhopal, India.

*Buniyadi Shiksha* (Hindi), Udaipur, India.

*Language in Society*, New York, USA.

*Journal of Reading*, New York, USA.

SCERT TELANGANA